www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
RNI.NO : APTEL/2022/90211
సంపుటి : 04 సంచిక : 003 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com శుక్రవారం 17 - 04 - 2026
Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన అసదుద్దీన్ ఒవైసీ




## కర్నూలు ప్రమాద బాధితులకు పరిహారం ప్రకటించిన ప్రధాని మోదీ

- మంత్రాలయం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం, 8 మంది మృతి
- మృతులంతా కర్ణాటకకు చెందిన యాత్రికులుగా గుర్తింపు
- ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి, పరిహారం ప్రకటన
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేల సాయం

# ఏపీలో ఇంటింటి గణన ప్రారంభం

- స్వయంగా తన వివరాలు నమోదు చేసుకున్న సీఎం చంద్రబాబు
- ఏపీలో ఇంటింటి గణన, గృహాల జాబితా సేకరణ ప్రారంభం
- స్వీయ నమోదు ప్రక్రియను ఆరంభించిన సీఎం చంద్రబాబు
- జనగణనలో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపు
- మే 1 తేదీ నుంచి ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియ
- ఈ నెల 30వ తేదీ వరకు ప్రజలు వివరాలు నమోదు చేసుకునే అవకాశం
- ఆన్‌లైన్‌లో తన వివరాలను స్వయంగా నమోదు చేసుకున్న ముఖ్యమంత్రి



**అమరావతి :**
రాష్ట్రంలో ఈ రోజు నుంచి ప్రారంభమైన స్వీయ జనగణన కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు తన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నారు. 'హౌస్ లిస్టింగ్- హౌస్ సెన్సెస్' కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా వివరాల నమోదు ప్రక్రియ ఈ రోజు ప్రారంభమైంది. ఒవ.ఎవఅంబం.స్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా చంద్రబాబు తన వివరాలను నమోదు చేశారు. ఇందులో మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను జనగణన డైరెక్టర్ జె.నివాస్ సీఎంకి వివరించారు. ఈ నెల 30వ తేదీ వరకూ ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామని చంద్రబాబుకి తెలిపారు. మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియను చేపడతారని తెలియచేశారు. దీనిపై స్పందించిన సీఎం రాష్ట్రంలో పౌరులందరికీ సమానంగా సంక్షేమం అభివృద్ధి ఫలాలు అందించాలన్న - మిగతా 2 లో

# డీలిమిటేషన్‌పై ప్రధాని భరోసా




- హర్షం వ్యక్తం చేసిన మంత్రి నారా లోకేశ్
- రాష్ట్రాల సీట్ల నిష్పత్తిలో మార్పు ఉండబోదన్న మోదీ
- దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్న సమయంలో ప్రధాని హామీ ఎంతో కీలకమన్న లోకేశ్
- ఎన్డీయే సమాఖ్య స్ఫూర్తికి కట్టుబడి ఉంటుందని వ్యాఖ్య

## మహిళా బిల్లుతో దేశ రాజకీయాల
# దిశ, దశ మారతాయి

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- బిల్లుపై మూజువాణి ఓటింగ్‌ను వ్యతిరేకించి డివిజన్‌కు పట్టుబట్టిన విపక్షాలు
- ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 251, వ్యతిరేకంగా 185 ఓట్లు
- బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని పార్టీలకు ప్రధాని విజ్ఞప్తి



**ఢిల్లీ :**
మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు నిర్ణయాధికార ప్రక్రియలో పాలుపంచుకోవడం ద్వారా దేశానికి కొత్త దిశానిర్దేశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కీలక బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు.కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్... రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026, డీలిమిటేషన్ బిల్లు, 2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026లను సభ ముందు ఉంచారు. అయితే, ఈ బిల్లును ప్రవేశపెట్టే సమయంలో విపక్షాలు మూజువాణి ఓటింగ్‌ను అంగీకరించలేదు. ఓట్ల విభజన (డివిజన్)కు పట్టుబట్టడంతో సభలో ఓటింగ్ నిర్వహించాల్సి వచ్చింది. బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 251 ఓట్లు, వ్యతిరేకంగా 185 ఓట్లు పోలైనట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా లోక్‌సభలో మూజువాణి ఓటు ద్వారానే తీర్మానాలు ఆమోదిస్తారు. కానీ, ఫలితంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పుడు సభ్యుల కోరిక మేరకు డివిజన్ నిర్వహిస్తారు. ఆటోమేటిక్ ఓట్ రికార్డర్ వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ తర్వాత ఓటు స్లిప్పుల ద్వారా జరిగిన ఓటింగ్‌లో మొత్తం 333 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, పార్టీలు ఈ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని విజ్ఞప్తి చేశారు. వికసిత భారత్ ఏ2047 లక్ష్యాన్ని - మిగతా 2 లో




## మహిళా బిల్లుపై పార్లమెంట్ లో చర్చ

- అమిత్ షా, అఖిలేశ్ ల మధ్య మాటల యుద్ధం
- 'ఉప-కోటా ' కోసం అఖిలేశ్ డిమాండ్.. కుదరదని తేల్చిచెప్పిన అమిత్ షా
- ఓబీసీ, ముస్లిం మహిళలకు సబ్-కోటా ఇవ్వాలని అఖిలేశ్ డిమాండ్
- మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కుదరవన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

# గృహిణులకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.4,000



## భారీ హామీలతో 'టీవీకే' మానిఫెస్టో ఆవిష్కరించిన విజయ్

- 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం టీవీకే మేనిఫెస్టో విడుదల
- గృహిణులకు నెలకు రూ.2,500, నిరుద్యోగ భృతిగా రూ.4,000 హామీ
- ఏడాదికి 6 గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- పాలన, విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం
- తమిళనాడును డ్రగ్ ఫ్రీ రాష్ట్రంగా మార్చడమే లక్ష్యం

**చెన్నై :**
నటుడి నుంచి రాజకీయ నేతగా మారిన విజయ్, తన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని రాబోయే ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, భారీ సంక్షేమ పథకాలు, టెక్నాలజీ ఆధారిత పాలన హామీలతో కూడిన పార్టీ మేనిఫెస్టోను గురువారం సాయంత్రం విడుదల చేశారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా, సామాజికంగా పునర్నిర్మించేందుకు రంగాలవారీగా సంస్కరణలు చేపడతామని ప్రకటించారు. సంప్రదాయ - మిగతా 2 లో

## తెలంగాణ రాష్ట్రంలో
# టాప్ 3 కులాలు



- నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం
- తెలంగాణ కుల సర్వే అధికారిక గణంకాలను విడుదల చేసిన ప్రభుత్వం
- రాష్ట్రంలో 56.36 శాతంతో బీసీలదే అగ్రస్థానం అని వెల్లడి
- జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో
- ఓసీల్లో రెడ్డి, ఎస్టీల్లో లంబాడీల జనాభా అత్యధికం
- దాదాపు 4 శాతం మంది ప్రజలు తమకు కులం లేదని వెల్లడించిన వైనం

**హైదరాబాద్ :**
తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన అధికారిక గణంకాలను విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతులు - మిగతా 2 లో




## తేజస్వి సూర్యపై కల్వకుంట్ల కవిత నిప్పులు

- రాజీనామా చేయాలని డిమాండ్
- తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడారంటూ తేజస్విపై కవిత ఫైర్
- పవిత్రమైన ఉద్యమాన్ని అగౌరవపరిస్తే ఊరుకోబోమని హెచ్చరిక
- కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్న

## తెలంగాణ రాష్ట్రంపై నిరంతరం
# విషపూరిత వ్యాఖ్యలు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- తెలంగాణను అవమానించిన తేజస్వి సూర్య ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి
- తెలంగాణ ఏర్పాటును భారత్-పాక్ విభజనతో పోల్చిన తేజస్వి సూర్య
- తేజస్వి వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని పొన్నం డిమాండ్
- బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్న



**హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెను దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ తేజస్వి సూర్యపై నిప్పులు చెరిగారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు అత్యంత అజ్ఞానంతో కూడుకున్నవని, అవి ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించేలా ఉన్నాయని పొన్నం పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంపై బీజేపీ నిరంతరం విషపూరిత వ్యాఖ్యలు చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి సైతం తేజస్వీ వ్యాఖ్యలను ఖండించారు. పార్లమెంట్‌లో తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన మంత్రి పొన్నం వెంటనే ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ డీఎన్ఏ - మిగతా 2 లో

# సంపాదకీయం

## పెనుమార్పు

పాతికేళ్ళక్రితం లాలూ యాదవ్ పార్టీ ఆర్జేడీతో తన రాజకీయ ప్రస్థానం ఆరంభించి, పన్నెండేళ్ళక్రితం నితీశ్‌కుమార్ పార్టీ జేడీయూలో చేరి, మూడేళ్ళలోనే అక్కడనుంచి బీజేపీలోకి గెంతిన సామ్రాట్ చౌదరి నేడు బిహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. యాభైఏడేళ్ళ వయసులో రాష్ట్రాన్ని ఏలబోతున్న తొలి బీజేపీ ముఖ్యమంత్రి ఆయన. గత ఏడాది అక్టోబర్‌లో బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా అమిత్ షా తారాపూర్ ప్రజలతో ఓ మాటన్నారు. సామ్రాట్ చౌదరిని గట్టిమెజారిటీతో గెలిపిస్తే, ఆయనను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒక అత్యంత ముఖ్యమైన వ్యక్తిగా మార్చేస్తారని. ఎమ్మెల్యేగా గెలిచి సామ్రాట్ చౌదరి మళ్ళీ డిప్యూటీ సీఎం కావడమే కాక, కొద్దినెలల్లోనే ఏకంగా రాజ్యపాలకుడైనారు.లాలూ ప్రసాద్ పక్షాన రబ్రీదేవి రాష్ట్రాన్ని ఏలుతున్న కాలంలో ఓ చిన్న మంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరి, అతివేగంగా ఎదిగి పాతికేళ్లు తిరిగేసరికి సీఎం కుర్చీలో కూర్చోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. పిన్నవయసునుంచి పార్టీకోసం చెమటోడ్చి, కనీసం టిక్కెట్టు కూడా దక్కని అనేకమంది సీనియర్ బీజేపీ నాయకులు ఈ విఐపి తొమ్మిదేళ్ళలోనే సీఎం స్థాయికి ఎదిగిన తీరుచూసి కుళ్ళుకుంటున్నారట. ఢిల్లీ నుంచి ఎవరినో దించి కొత్త అలజడి సృష్టించడం కంటే డిప్యూటీ సీఎంగా ఉన్న వ్యక్తికే ప్రమోషన్ ఇస్తే పార్టీలో కుదుపులు, కుతకుతలు ఉండవని బీజేపీ అధిష్టానం అనుకొని ఉంటుంది. నితీశ్‌కుమార్ అధికారంలో ఉండగా, ‘లవకుశు’లకు, అంటే కుర్మీ కుశ్వాహాలకు సమతూకంలో దక్కిన ప్రాధాన్యాన్ని అదేరీతిలో కొనసాగించడం కూడా బీజేపీ ఆలోచన కావచ్చు. యాదవేతర కులాలను తమ పక్షాన నిలబెట్టుకోవాల్సిన బీజేపీ, కుశ్వాహా కులానికి చెందిన సామ్రాట్ చౌదరిని ముఖ్యమంత్రి పదవిలో కూచోబెట్టింది కనుక, డిప్యూటీ సీఎం పదవి నితీశ్ కులమైన కుర్మీలకు దక్కుతుందని అంటున్నారు.నాలుగేళ్ళక్రితం నితీశ్‌కుమార్ మారోమారు ఎన్డీయేకి చెయ్యిచ్చి, ఆర్జేడీతో చేతులు కలిపిన ఆర్నెల్లలోనే సామ్రాట్ చౌదరిని బీజేపీ అధినాయకత్వం బిహార్ రాష్ట్రశాఖ అధ్యక్షుడుగా ప్రతిష్ఠించింది. ఆయన పనితీరుమీద ఎన్ని ఫిర్యాదులున్నా, అసమ్మతి తీవ్రస్థాయికి చేరినా, కష్టపడే ఆయన స్వభావం, పార్టీని ఒక్కతాటిపై నడిపించడంలో నైపుణ్యం చూసి బీజేపీ పెద్దలు సామ్రాట్‌ని స్వేచ్ఛగా వదిలేశారు. మహాగద్బంధన్‌లో చేరిన నితీశ్‌ను గద్దెదించేంతవరకూ నెత్తిన తలపాగా ధరిస్తానని ప్రతిజ్ఞచేసిన సామ్రాట్, మరో రెండేళ్లలో నితీశ్ వెనక్కురాగానే అయోధ్యవెళ్ళి, గుండుగీయించుకొని, సరయూ నదిలో మునకలేసి, తలపాగా వదిలేశారట. అమిత్‌షాకు అమిత విశ్వాసపాత్రుడు కావడమే కాక, నితీశ్, సామ్రాట్ మధ్య చక్కని సమన్వయం, సయోధ్య ఉండటం కూడా కొత్త సీఎం ఎంపికమీద పనిచేసివుండవచ్చు. మొత్తానికి, రాష్ట్రాన్ని సొంతంగా ఏలుకోవాలన్న బీజేపీ కోరిక ఇంతకాలానికి నెరవేరుతోంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలనాటికే ఈ పరిణామాన్ని విశ్లేషకులు ఊహించారు. స్థానిక బీజేపీ నాయకులు సైతం తమ మనసులో కోరికను ఎప్పటికప్పుడు బయటపెడుతూనే వచ్చారు. తొలిసారిగా బీజేపీ, జేడీయూలు సమానసంఖ్యలో చెరి నూటొక్కస్థానాల్లో పోటీచేయడం కూడా ఈ ఊహాగానాలకు దోహదం చేసింది. నితీశ్ నాయకత్వంలో ఎన్నికలకు పోతున్నామని బీజేపీ ప్రకటించింది కానీ, కాబోయే ముఖ్యమంత్రి ఆయనేనని ఎక్కడా అనలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీజేడీయూ కలసికట్టుగా ఘనవిజయం సాధించి, బీజేపీ అతి పెద్దపార్టీగా అవతరించి, నితీశ్ పదోసారి సీఎం అయిన నాలుగునెలలకే ఆయన మనసు పెద్దల సభమీదకు పోయింది. ఎగువసభలో కూచొని ప్రజలకు సేవచేసుకోవాలన్న ఆ చిరకాల కోరిక రెండు దశాబ్దాలపాటు ముఖ్యమంత్రి పదవిని అనుభవిస్తున్నప్పుడు కానీ, కేవలం సీఎం కుర్చీకోసం పొత్తులను ఎడాపెడా మార్చేస్తున్నప్పుడు కానీ ఆయనకు ఎందుకో గుర్తుకురాలేదు. ఢిల్లీలో కూచొని బిహారీలకు పెద్దదిక్కుగా ఉంటానని ఆయన హామీ ఇస్తున్నప్పటికీ, బిహార్ రాజకీయాల్లో ఇక ఆయన పాత్ర ముగిసినట్టే, సామ్రాట్ చౌదరి ప్రవేశంతో రాష్ట్రం బీజేపీ వశమైనట్టే. చరిత్ర ఈ పరిణామాన్ని నితీశ్–లాలూ శకం ముగింపుగా గుర్తుంచుకుంటుందా, లేక బీజేపీ శకారంభంగా చూస్తుందా?



# కర్నూలు ప్రమాద బాధితులకు పరిహారం ప్రకటించిన ప్రధాని మోదీ

**మొదటిపేజీ తరువాయి** – కర్నూలు జిల్లాలోని మంత్రాలయం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్‌ఆర్‌ఎఫ్) నుంచి నష్టపరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.గురువారం తెల్లవారుజామున మంత్రాలయం మండలం చిలకలడోన సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. శ్రీ రాఘవేంద్ర స్వామి వారిని దర్శించుకునేందుకు కర్ణాటకలోని చిక్‌మంగళూరు నుంచి యాత్రికులతో వస్తున్న బొలెరో



వాహనం, ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మరణించగా, మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. దీంతో మృతుల సంఖ్య 8కి చేరింది. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక బాలిక ఉన్నారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే క్షతగాత్రులను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, బొలెరో డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే ప్రమాదానికి ప్రాథమిక కారణమని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ దుర్ఘటన అత్యంత బాధాకరమని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గృహిణులకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.4,000

**మొదటిపేజీ తరువాయి** - సంక్షేమ పథకాలతో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను పాలనలో ప్రవేశపెట్టడం ద్వారా వినూత్న మార్పునకు శ్రీకారం చుడతామని విజయ్ స్పష్టం చేశారు.ప్రజాకర్షక పథకాలకు మేనిఫెస్టోలో పెద్దపీట వేశారు. గృహిణులకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు రూ.4,000, డిప్లొమా హోల్డర్లకు ₹2,500 భృతి అందిస్తామని హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఐదు లక్షల మందికి రూ.18,000 చొప్పున ఉపాధి ఆధారిత మద్దతు పథకాన్ని ప్రకటించారు. దీంతో పాటు, ఇంటర్న్‌షిప్ చేసే యువతకు రూ.5,000 నుంచి రూ.8,000 వరకు స్టైఫండ్ ఇస్తామని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందించే పింఛనును నెలకు రూ.3,000కు పెంచుతామని, దాదాపు 15 లక్షల మందికి ఈ ప్రయోజనం చేకూరుస్తామని పేర్కొన్నారు.మహిళా సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, పేద యువతుల వివాహానికి ఒక సవర బంగారం, పట్టు చీరతో కూడిన ఆర్థిక సహాయం అందిస్తామని వాగ్దానం చేశారు. ప్రభుత్వ భూముల్లో అర్హులైన వారికి ఉచితంగా ఇంటి పట్టాలు ఇస్తామన్నారు.ఆరోగ్య రంగంలో ఉచిత వైద్య పరీక్షలు, తక్కువ ధరలకే మందులు, క్యాన్సర్ బాధితుల కోసం ప్రత్యేక బీమా సౌకర్యం కల్పిస్తామని టీవీకే హామీ ఇచ్చింది. ప్రాథమిక సేవలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ, ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు, ఏడాదికి ఆరు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రకటించారు.రైతులకు అండగా నిలుస్తూ, ఐదు ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతుల రుణాల్లో 50 శాతం మాఫీ చేస్తామని, సౌరశక్తి ప్రాజెక్టులను ప్రోత్సహిస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచారు. మత్స్యకారులకు కనీస మద్దతు ధర, చేపల వేట లేని సమయంలో రూ.27,000 ఆర్థిక సహాయం, రూ.25 లక్షల బీమా కవరేజీ కల్పిస్తామన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి అంగన్‌వాడీ సిబ్బందికి రూ.18,000, పారిశుద్ధ్య కార్మికులకు రూ.10,000 వేతనం, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు రూ.15 లక్షల ప్రయోజనం కల్పిస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇస్తూ, "డ్రగ్–ఫ్రీ తమిళనాడు" కార్యక్రమాన్ని



ప్రారంభిస్తామని విజయ్ ప్రకటించారు. ఆర్థికంగా, 2036 నాటికి తమిళనాడును 1.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం రూ.15,000 కోట్లతో భద్రతా నిధిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ మేనిఫెస్టో ద్వారా సంక్షేమ పథకాలను, టెక్నాలజీ ఆధారిత అభివృద్ధిని జోడించి ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు టీవీకే సిద్ధమవుతోంది.

# మహిళా బిల్లుపై పార్లమెంట్ లో చర్చ

**మొదటిపేజీ తరువాయి** – కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై (నారీ శక్తి వందన్ అధినియం) పార్లమెంటులో వాడివేడి చర్చ జరిగింది. ఈ బిల్లులో ఓబీసీ, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా కల్పించాలన్న డిమాండ్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ మధ్య తీవ్ర వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి.ఈ చర్చలో అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ.. మహిళలకు కేటాయించిన 33శాతం రిజర్వేషన్లలో వెనుకబడిన వర్గాలు (ఓబీసీ), ముస్లిం మహిళలకు ప్రత్యేకంగా ఉప–కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. అప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.అఖిలేశ్ డిమాండ్‌పై అమిత్ షా తీవ్రంగా స్పందించారు. భారత రాజ్యాంగం ప్రకారం మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం అసాధ్యమని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే విపక్షాలు ఇలాంటి డిమాండ్లు చేస్తున్నాయని విమర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి ఇది పూర్తిగా విరుద్ధమని ప్రభుత్వం తరపున ఆయన గట్టిగా వాదించారు.ఈ బిల్లును వెంటనే అమలు చేయకుండా జనాభా గణన (సెన్సస్), నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే అమలు చేస్తామని చెప్పడంపైనా విపక్షాలు అభ్యంతరం తెలిపాయి. ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తోందని అఖిలేశ్ యాదవ్‌తో పాటు ఇతర ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం



కాగా, ఓబీసీ, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా లేకపోవడమే ప్రస్తుత వివాదానికి కేంద్ర బిందువుగా మారింది.

# తెలంగాణ రాష్ట్రంలో టాప్ 3 కులాలు

**మొదటిపేజీ తరువాయి** – (బీసీలు) 56.36 శాతంతో అతిపెద్ద సామాజిక వర్గంగా నిలిచారు. జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోనే ఆదర్శవంతంగా, అత్యంత పారదర్శకంగా ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేశామని ప్రభుత్వం ప్రకటించింది.

ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.03 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేశారు. ప్రజల నుంచి ‘సెల్ఫ్ డిక్లరేషన్‘ పద్ధతిలో వివరాలను సేకరించారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 1,12,36,849 కుటుంబాలను సర్వే బృందాలు సందర్శించి, 3,55,50,759 మంది జనాభా వివరాలను నమోదు చేసినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది.

**సామాజిక వర్గాల వారీగా జనాభా వాటా**

సర్వే ఫలితాల ప్రకారం, రాష్ట్ర జనాభాలో బీసీల తర్వాత షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 17.42 శాతం, అగ్రవర్ణాలు (ఓసీలు) 15.79 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 10.43 శాతం చొప్పున ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 4 శాతం మంది ప్రజలు తమకు ఎలాంటి కులం లేదని (నో క్యాస్ట్)







తమ డిక్లరేషన్‌లో పేర్కొనడం గమనార్హం.

**కులాల వారీగా ప్రధాన వర్గాలు**

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులాల జాబితాను పరిశీలిస్తే, 36.58 లక్షల మందితో (10.3 శాతం) మాదిగ సామాజిక వర్గం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 27.96 లక్షల మందితో (7.9 శాతం) షేక్ ముస్లింలు రెండో స్థానంలో, 26.39 లక్షల జనాభాతో (7.4 శాతం) ముదిరాజ్ సామాజిక వర్గం మూడో స్థానంలో ఉన్నాయి.

**ఓసీ వర్గాల్లో:** రెడ్డి సామాజిక వర్గం 4.8 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కోమటి (1.4 శాతం), కమ్మ (1.0 శాతం), బ్రాహ్మణ (0.9 శాతం), కాపు/నాయుడు (0.7 శాతం), వెలమ (0.4 శాతం) ఉన్నారు.

**బీసీ వర్గాల్లో:** షేక్ ముస్లింలు (7.9 శాతం) అత్యధిక జనాభాతో ముందుండగా, ముదిరాజ్ (7.4 శాతం), యాదవ (5.7 శాతం), గౌడ్ (4.6 శాతం), మున్నూరుకాపు (3.9 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచారు.

**ఎస్సీ వర్గాల్లో:** మాదిగ (10.3 శాతం) సామాజిక వర్గం అత్యధిక జనాభా కలిగి ఉండగా, మాల (4.1 శాతం), బేడా (0.5 శాతం), మాల సేల్ (0.5 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

**ఎస్టీ వర్గాల్లో:** లంబాడీలు 6.8 శాతం జనాభాతో అగ్రస్థానంలో నిలిచారు. కోయ (1.2 శాతం), గోండ్ (1.1 శాతం), ఎరుకుల (0.5 శాతం) వారి తర్వాత ఉన్నారు.

ఈ సర్వే ద్వారా వెల్లడైన గణంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల రూపకల్పన, రాజకీయ సమీకరణాల్లో కీలక పాత్ర పోషించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# డీలిమిటేషన్‌పై ప్రధాని భరోసా



**మొదటిపేజీ తరువాయి** – నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని, పార్లమెంట్‌లో రాష్ట్రాల సీట్ల నిష్పత్తిలో మార్పు ఉండబోదని ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన హామీపై ఏపీ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని చేసిన ఈ ప్రకటన దక్షిణాది రాష్ట్రాలకు పెద్ద ఊరటనిస్తుందని ఆయన పేర్కొన్నారు.జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలు, సీట్ల విభజన వల్ల తమ ప్రాధాన్యత తగ్గుతుందని ఆందోళన చెందుతున్న తరుణంలో ప్రధాని ఇచ్చిన హామీ ఎంతో కీలకమని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఎన్డీయే ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తికి కట్టుబడి ఉందనడానికి ప్రధాని మాటలే నిదర్శనమని కొనియాడారు. ఏ రాష్ట్రం కూడా నష్టపోకుండా అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నదే కూటమి ఉద్దేశమని స్పష్టం చేశారు. “ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు.. ఇది ఎన్డీయే గ్యారెంటీ“ అంటూ లోకేశ్ ఎక్స్ వేదికగా ధీమా వ్యక్తం చేశారు. సమానత్వమే కూటమి లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# మహిళా బిల్లుతో దేశ రాజకీయాల దిశ, దశ మారతాయి

**మొదటిపేజీ తరువాయి** – చేరుకోవడంలో మహిళా రిజర్వేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. గతంలో ఈ బిల్లును వ్యతిరేకించిన వారికి మహిళా ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారని ఆయన వ్యాఖ్యానించారు.

# తెలంగాణ రాష్ట్రంపై నిరంతరం విషపూరిత వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి** – ఉన్న ప్రతి ఒక్కరూ ఈ వ్యాఖ్యలను ఖండించాలని పొన్నం పిలుపునిచ్చారు. రాష్ట్ర గౌరవాన్ని కించపరిస్తే తెలంగాణ బీజేపీ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉంటున్నారు? అని ఆయన నిలదీశారు. తెలంగాణ ఏర్పాటు అనేది దశాబ్దాల పోరాటమని, వేలాది మంది త్యాగాల ఫలితమని, దానిని విద్వేషపూరిత విభజనతో పోల్చడం రాజ్యాంగాన్ని కించపరచడమేనని మండిపడ్డారు. తేజస్వి సూర్యకు తెలంగాణ చరిత్రపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. ఒక జాతీయ పార్టీకి చెందిన ఎంపీ ఇంత బాధ్యతారాహిత్యంతో మాట్లాడటం సరికాదని హితవు పలికారు.

# ఏపీలో ఇంటింటి గణన ప్రారంభం



**మొదటిపేజీ తరువాయి** – సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. దీని కోసం కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికలని రూపొందించటం అవసరమని ఈ లక్ష్య సాధనలో జనగణన కార్యక్రమం అత్యంత కీలకమని స్పష్టం చేశారు.2 దశల్లో జనాభా లెక్కల కార్యక్రమం: రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా రాష్ట్రంలో జనగణన కార్యక్రమం జరుగుతోందని ఇది కేవలం సమాచార సేకరణ మాత్రమే కాకుండా అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. జనాభా లెక్కల కార్యక్రమం 2 దశల్లో జరుగనుందని మొదటి దశలో ఈ రోజు నుంచే ఇళ్ల గణన ప్రారంభమైందని వచ్చే ఏడాది నుంచి ప్రారంభమయ్యే 2వ దశలో జనాభా లెక్కల సేకరణ ప్రారంభమవుతుందని తెలిపారు.ప్రస్తుతం ప్రారంభమైన ఇళ్ల గణన కార్యక్రమంలో ప్రజలు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని సీఎం విజ్ఞప్తి చేశారు. సరైన వివరాలను నమోదు చేయటం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సహకారం అందించాలని ప్రజలను కోరారు. మొత్తం ఈ జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

# తేజస్వి సూర్యపై కల్వకుంట్ల కవిత నిప్పులు



**మొదటిపేజీ తరువాయి** – పార్లమెంట్ వేదికగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్–పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కార్చిచ్చు రేపాయి. ఈ వ్యాఖ్యలపై స్పందిస్తూ మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోషల్ మీడియా వేదికగా తేజస్వి సూర్యపై విరుచుకుపడ్డారు.నిండు పార్లమెంట్‌లో తెలంగాణ అస్తిత్వాన్ని, అమరవీరుల త్యాగాలను కించపరిచేలా మాట్లాడటంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నీకు ఎంత ధైర్యం ఉంటే తెలంగాణ ఏర్పాటును ఒక విద్వేషపూరిత విభజనతో పోలుస్తావు? అంటూ నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన తేజస్వి సూర్య తన ఎంపీ పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అంటే ఒక పోరాటమని, కోట్లాది మంది కలల సాకారమని... అటువంటి పవిత్రమైన ఉద్యమాన్ని అగౌరవపరిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి బీజేపీ అగ్రనేతలు ఈ వ్యాఖ్యలపై ఎందుకు మౌనంగా ఉన్నారని కవిత ప్రశ్నించారు. సొంత రాష్ట్రాన్ని అవమానిస్తుంటే అడ్డుకోని వారు పదవుల్లో ఉండటానికి అనర్హులని, తెలంగాణ ప్రజలకు వారు సమాధానం చెప్పి తీరాలని డిమాండ్ చేశారు.

# టిడిపి పార్టీ బలోపేతానికి కన్నబాబు కృషి ఎనలేనిది

- రాష్ట్ర కార్యదర్శిగా పదవి దక్కడంపై కన్నబాబుకు అభినందనల వెల్లువ
- పెద్ద ఎత్తున తరలివచ్చిన నాయకులు,కార్యకర్తలు, అభిమానులు
- శాలువలు కప్పి, పుష్పగుచ్ఛా లు అందించిన తెదేపా శ్రేణులు
- తెదేపాలో నూతన ఉత్సాహం





**గోకవరం,ఏప్రిల్16.అక్షర టైమ్స్:**-తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కన్నబాబుకు అభినందనలు వెల్లు విత్తాయి. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో గురువారం ఉదయం నుంచి కృష్ణునిపాలెం గ్రామంలో గల ఆయన కార్యాలయం వద్ద సందడి నెలకొంది. పుష్పగుచ్ఛాలు అందించడంతో పాటు శాలువాలు కప్పి, పూలదండలు వేసి ప్రతి ఒక్కరు ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం అందరి సమక్షంలో ఆయన కేక్ కట్ చేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏ ఆపద వచ్చిన ఆదుకునే కన్నబాబు వంటి నాయకునికి రాష్ట్రస్థాయి పదవి దక్కడం తమ అదృష్టం అంటూ కొందరు భావోద్వేగంతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ శాసనసభ్యులు, టిటిడి బోర్డు జ్యోతుల నెహ్రూ సారథ్యంలో టిడిపి పార్టీని మరింత బలోపేతం దిశగా కృషి చేస్తానని, కాకినాడ పార్లమెంటరీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ సారథ్యంలో పార్టీ విధివిధానాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ అడపా భరత్ కుమార్ సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్ ఉంగరాల రాము సొసైటీ చైర్మన్ గాజంగం సత్తిబాబు మండల పార్టీ అధ్యక్షులు పిల్లా అర్జున సారథి పాలూరి బోసు బాబు..గునిపే భరత్ . మండిగ గంగాధర్. బద్దిరెడ్డి అచ్చన్న దొర. బదిరెడ్డి బాబి.దాసరి సీతారాం. మండిగ బాలాజీ. మల్లి రెడ్డి శ్రీకృష్ణ. సాలాపు నలమహారాజు. ఉంగరాల గణేష్. పోసిన ప్రసాద్. బదిరెడ్డి రవి. మొదలగు వారు పాల్గొన్నారు

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

## ఒమ్మంగిలో రామిశెట్టి నాని జన్మదిన వేడుకల్లో పాల్గొన్న వైసీపీ ఇంచార్జి ముద్రగడ గిరిబాబు



**శంఖవరం/ప్రత్తిపాడు,ఏప్రిల్16.అక్షర టైమ్స్:**- కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో మండల వైసీపీ అధ్యక్షులు రామిశెట్టి నాని జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు.గ్రామంలో జరిగిన ఈ వేడుకలు పార్టీ శ్రేణులు, అభిమానుల మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రత్తిపాడు వైసీపీ ఇంచార్జి ముద్రగడ గిరిబాబు హాజరయ్యారు.ఆయన రామిశెట్టి నాని చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.నాని సేవలు,పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషిని గిరిబాబు అభినందించారు.ఈ సందర్భంగా గ్రామంలో నేతలు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పన నాయుడు, కొప్పన గంగారావు, సాధనాల అప్పారావు, తిరగటి మణి ప్రకాష్,పలివెల సూర్య ప్రకాష్,చింతపల్లి ఏసు తదితరులు పాల్గొన్నారు.తనకు జన్మదిన శుభాకాంక్షలు ప్రత్యక్షంగా, పరోక్షంగా వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన ప్రతి ఒక్కరికి రామిశెట్టి నాని కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రత్తిపాడులో వేగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలకు ఘన ఏర్పాట్లు

- ఆలయ కమిటీ చైర్మన్ వెలుగుల నాని



**ప్రత్తిపాడు,ఏప్రిల్16.అక్షర టైమ్స్:**- కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో వేంచేసియున్న గ్రామదేవత శ్రీ శ్రీ శ్రీ వేగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 9 నుంచి 20 వరకు ఘనంగా నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు.వేగులమ్మ అమ్మవారి ఆలయంతో పాటు ప్రధాన రహదారి గాంధీ సెంటర్ నుంచి ఆంజనేయ స్వామి ఆలయ సెంటర్ వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు.ఈ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 17న జాగారం ల్,18న శక్తి వేషాలు,గరగ నృత్యాలు,డీజే నృత్యాలు,కోబ్రా డాన్సులు 19న సంగీత విభావరి 20న వినూత్న బుర్రకథ తీర్థ మహోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వెలుగుల కొండలరావు (నాని )తెలిపారు.అమ్మ వారి ఆశీస్సులు ప్రజలు అందరిపై ఉండాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## శంఖవరం కస్తూరిభాగాంధీ బాలికా విద్యాలయం ఇంటర్మీడియట్ టాపర్ తంగెల్లా తనూజ

- తండ్రిని అభినందించిన ప్రిన్సిపాల్ బాల కుమారి



**శంఖవరం,ఏప్రిల్16.అక్షర టైమ్స్:**-కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం లో శంఖవరం నందు ఉన్న కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయం ఇంటర్మీడియట్ ఫలితాలలో రెండవ సంవత్సరంలో ఎం పి సి గ్రూప్ నందు 952 మార్కులతో ప్రథమ స్థానం సంపాదించినా తంగెల్లా తనూజ తండ్రి సత్తిబాబు చెందుర్తి గ్రామానికి చెందిన పేదింటి బిడ్డా చిన్న తనంలోనే తల్లిని కొల్పొయి 6 వ తరగతి లో శంఖవరం కస్తూరిభ గాంధీ బాలిక విద్యాలయంలో ప్రవేశం పొంది పదవ తరగతి నందు 531 మార్కులతో విద్యాలంలో ద్వితీయ స్థానం లోఉత్తీర్ణరాలుయింది.అదే పట్టుదల సంకల్పంతో అదే పాఠశాల నందు ఇంటర్మీడియట్ ఎం.పి.సి గ్రూప్ జాయిన్ అయ్యి కళాశాల నందు 952 మార్కులతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.ఆమె తండ్రి తన ఉత్తీర్ణత చూసి ఆనందం వ్యక్తం చేశారు.అతని రెండవ కూతుర్ని కూడా యిక్కడే జాయిన్ చేశారు. యిప్పుడు 9 వ తరగతి చదువుతుంది. మాలాంటి పేద తల్లిదండ్రులకు కస్తూరిబాయ్ కళాశాల ఒక వరమని గ్రాడ్యుయేషన్ కోర్స్ కూడా ఉంటే బాగుంటుందని ఆశ.దృక్పథాన్ని వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది తనూజ ని అభినందించారు.ఆమె తన జీవితంలో మరిఎన్నో విజయాలిని సాధించాలని ఆశీర్వాదించారు.

## అంబేద్కర్ భావితరాల భవిష్యత్తుకి మార్గదర్శి..

- చిందాడ చిన్నోడు (మాస్టర్)



**శంఖవరం/తొండంగి,ఏప్రిల్16.అక్షర టైమ్స్:**- అంబేద్కర్ భావితరాల భవిష్యత్తుకి మార్గదర్శి అని చెందాడ చిన్నోడు (మాస్టర్) అన్నారు.తుని నియోజకవర్గం తొండంగి మండలం ఏవి నగరం గ్రామంలో చిందాడ చిన్నోడు ఆధ్వర్యంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా యనమాల పెదబాబు, కొయ్య మురళి, పులుగుయనమల పెదబాబు కొయ్య మురళి పులుగు ఇమ్మానుయేలు మాస్టర్ రమణ, చిందాడ నాగేశ్వరావు చిందాడ డేవిడ్ రాజ్,దళిత ప్రజాసైతన్యం రాష్ట్ర కార్యదర్శి చిండాడ అర్జునరావు అంబేద్కర్ విగ్రహాన్ని ఘనంగా పూలమాలతో సత్కరించారు. పలు సేవ కార్యక్రమాలు నిర్వహించిన చిందాడ చిన్నోడు (మాస్టర్) కి గ్రామ పెద్దలు నాయకులు ఘనంగా సన్మాన సన్మానించారు. ఈ కార్యక్రమంలో డి. పృథ్వీరాజ్, మాతా గంగాధర్, గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో యువత పాల్గొన్నారు.

# వీరేశలింగం సామాజిక దురాచారాల నిర్మూలనకు జీవితాన్ని అంకితం చేశారు

- జనసేన పార్టీ రాజమండ్రి అధ్యక్షులు వై.శ్రీనివాస్



**రాజమండ్రి,ఏప్రిల్16.అక్షర టైమ్స్:**- సంఘసంస్కర్త, రచయిత, కందుకూరి వీరేశలింగం 178వ జయంతి సందర్భంగా రాజమహేంద్రవరం నగరంలోని ఆనంద గార్డెన్స్ ప్రాంగణంలో ఉన్న కందుకూరి వీరేశలింగం దంపతుల సమాధి వద్ద పూలు సమర్పించి జనసేన పార్టీ రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు వై. శ్రీనివాస్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కందుకూరి వీరేశలింగం సమాజంలో ఉన్న సామాజిక దురాచారాలపై పోరాడిన మహానుభావుడని కొనియాడారు. సతీసహగమనాన్ని వ్యతిరేకించి వితంతు పునర్వివాహాలను జరిపించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. మహిళా విద్యకు ప్రాధాన్యం ఇచ్చి, సామాజిక అభ్యున్నతికి మార్గదర్శకుడిగా నిలిచిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన సాహిత్య రచనలు ప్రజల్లో చైతన్యం కలిగించడంలో కీలక పాత్ర పోషించాయని, వివేకవర్ధిని పత్రిక ద్వారా సమాజంలో చైతన్యం కలుగజేసారన్నారు. సమానత్వం, విద్య, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. హితకారిణి సమాజం స్థాపించి విద్యాభివృద్ధికి, సమాజ హితానికి తన యావదాస్తిని దానం చేసిన గొప్ప వ్యక్తి అని ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తేజ మూర్తుల నరసింహమూర్తి, జాంపేట ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్, దాసరి గురునాథరావు, పార్టీ జిల్లా కార్యదర్శి జామి సత్యనారాయణ, ఆర్యాపురం కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ కప్పల సూర్య ప్రకాష్, 8వ వార్డ్ ఇంచార్జ్ అక్కిరెడ్డి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పైడ్రాజు, పందిరి మహాదేవుడు చౌల్ట్రీ డైరెక్టర్ యందం ఇందిరా, జనసేన పార్టీ వీర మహిళలు సిరినాయుడు, నాగలక్ష్మి, దేవి, తదితరులు పాల్గొన్నారు.

# బరియల్ గ్రౌండ్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలి



**రాజమహేంద్రవరం,ఏప్రిల్16.అక్షర టైమ్స్:**- క్రైస్తవుల సమాధి కార్యక్రమాల నిమిత్తం రాజమండ్రి రూరల్ ధవలేశ్వరంలో ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ కు ప్రహరీ గోడ నిర్మించాలని రాజమండ్రి అర్బన్& రూరల్ పాస్టర్ అసోసియేషన్, క్రిస్టియన్ బరియన్ గ్రౌండ్ అడ్వైజరీ కమిటీ, పాస్టర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తీర్మానించారు. గ్రౌండ్ ఇంచార్జ్, పాస్టర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు పొన్నమాటి బాబ్జి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. బరియల్ గ్రౌండ్ చుట్టుప్రక్కల నివాస ప్రాంతాలైన రెవిన్యూ కాలనీ, సావిత్రినగర్, టిడ్కో గృహాలకు సమస్యలు లేకుండా బరియల్ గ్రౌండ్ చుట్టూ ప్రహరీగోడ నిర్మించాలని టిడిపి క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామి ద్వారా స్థానిక శాసనసభ్యులకు, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులకు వినతిపత్రం సమర్పించామన్నారు. బరియల్ గ్రౌండ్లో మౌలిక సదుపాయాలు, సిసి రోడ్లు, విద్యుత్ దీపాలు, మంచినీటి బోరు కల్పించాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో జాయింట్ యాక్షన్ కమిటీ గోడి మోజెస్, బిషప్ టి. ఆర్డర్ ప్రసాద్, బిషప్ టి.రాజేంద్రప్రసాద్, రెవ. డా. పైడిమళ్ళ సుందరరాజు, రెవ. పి. ఎర్నెస్ట్ మోజెస్, బిషప్ ఎం.సాల్మన్ జార్జ్, బిషప్ ఫ్రాన్సిస్, రెవ. యంపా ప్రభాకర్, బ్రదర్ కె. శాంతారావు, రెవ. బి. ఏలియా, బ్రదర్ గెల్లా విజయ కుమార్, రెవ. బి. జార్జి పీటర్, రెవ. ఎస్. ప్రకాశం, రెవ. ఎం. మానుకొండ సుధాకరరావు, రెవ. డా. జి. డేనియల్ విల్సన్, రెవ. మేడిద విజయ్కుమార్, రెవ. మందా రాజు, శ్రీ గెద్దం వెంకటరత్నం, రెవ. ఆరుగుళ్ళ రాజ్కుమార్, రెవ. ఎం.మోహన్రావు, రెవ. పులగుర్త శ్యామ్ కిట్లీ కుమార్, ఉల్లంపర్తి శామ్యూల్, ప్రొఫెసర్ ఎం. జాషువా కిరణ్, బ్రదర్ ఎస్. శాంతారావు, బ్రదర్ విజయ్ ప్రకాష్, ఇంజేటి రాధాకృష్ణ, ఇంజేటి కిషోర్కుమార్, రెవ. గోడి జాన్, రెవ. ఎన్. లాజరు, రెవ. పి. పరంజ్యోతి, రెవ. చార్లెస్, రెవ. వాసంశెట్టి ఆనంద్ కుమార్, రెవ. రాచర్ల జాకబ్ పాల్గొన్నారు.

# పెద్దనాపల్లిలో జనగణన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

- మొదటగా జనగణనలో ఎంపీపీ వివరాల నమోదు
- ప్రజా సేవల సమర్థ అమలుకు జనగణన కీలక అడుగు : ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



**ఏలేశ్వరం,ఏప్రిల్16.అక్షర టైమ్స్:**- ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామంలో జనగణన కార్యక్రమం కార్యక్రమాన్ని ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి నివాసం వద్ద అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ వర్మ కార్యక్రమాన్ని ప్రారంభించి జనగణన ప్రాముఖ్యతను వివరించారు.గ్రామంలోని ప్రతి ఇంటి వివరాలు సక్రమంగా సేకరించడం ద్వారా ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి వ్యక్తికి చేరేలా చేయవచ్చని ఎంపీడీఓ వర్మ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ జనగణన కార్యక్రమం గ్రామాభివృద్ధికి పునాది వంటిదని తెలిపారు.ప్రతి కుటుంబానికి సంబంధించిన సమగ్ర సమాచారం సేకరణ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.గ్రామ స్థాయి అభివృద్ధి ప్రణాళికలు మరింత పకడ్బందీగా రూపొందించడానికి ఈ డేటా ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది,గ్రామ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు,ఆర్థిక స్థితి, విద్య, వృత్తి, ఆరోగ్య పరిస్థితి వంటి అంశాలను నమోదు చేసే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు.సర్వే సజావుగా సాగేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని,ప్రజలు పూర్తి సహకారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ఏవో జోకా అమృత ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్ర సిబ్బందికి శిక్షణ

- శిక్షణా తరగతులకు హాజరై పలు సూచనలు చేసిన ఏడిఏ జి శ్రీనివాస్




**ప్రత్తిపాడు,ఏప్రిల్16.అక్షర టైమ్స్:**- రాష్ట్ర రైతు సాధికార సంస్థ-ఏపీసిఎన్ఎఫ్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారిణి జోకా అమృత పర్యవేక్షణలో మండల సాంకేతిక నిపుణుడు కె. నికేశ్ వర్మ సమన్వయంతో రైతు సేవా కేంద్ర సిబ్బందికి నిర్వహించిన రెండు రోజుల సహజ వ్యవసాయ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.ఈ నెల 15, 16 తేదీల్లో జరిగిన ఈ శిక్షణలో గ్రామ వ్యవసాయ సహాయకులు,గ్రామ ఉద్యానవన సహాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వర్షాకాలానికి ముందు పొడి విత్తనం విధానం,ఎల్-నినో ప్రభావం,బహుళ పంటల సాగు నమూనాలు,సహజ వ్యవసాయ విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.వర్షాకాలానికి ముందు పొడి విత్తనం విధానం (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్)పై ప్రత్యేకంగా దృష్టి సారించడంపై వివరించారు.వర్షాలు పడకముందే పొలంలో విత్తనాలను చల్లి సాగు ప్రారంభించే ఈ విధానంలో 32 రకాల విత్తనాలను కలిపి చల్లడం జరుగుతుందని వివరించారు.ఎకరానికి సుమారు 12 కిలోల విత్తన మిశ్రమం అవసరమని తెలిపారు.మండలంలో ఈ పద్ధతిని ప్రోత్సహించేందుకు 200 వర్షాకాలానికి ముందు పొడి విత్తనం కిట్లు సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు.ఈ విధానం ద్వారా పొలంలో సుమారు 10 టన్నుల సేంద్రియ పదార్థం పెరిగి నేల సారం మెరుగుపడుతుందని,ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని పేర్కొన్నారు.శిక్షణలో 22 మంది రైతు సేవా కేంద్ర సిబ్బంది,33 మంది సహజ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న జగ్గంపేట ప్రాంత సహాయ వ్యవసాయ సంచాలకులు జి.శ్రీనివాస్ సూచనలు అందిస్తూ,సహజ వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా అమలు చేయాల్సిన అవసరాన్ని వివరించారు.ఇలాంటి శిక్షణలు రైతుల్లో సహజ వ్యవసాయంపై అవగాహన పెంచడమే కాకుండా, వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు చేయడంలో దోహదపడతాయని అధికారులు తెలిపారు.



# ఘనంగా కందుకూరి వీరేశలింగం జయంతి వేడుకలు

**గోకవరం,ఏప్రిల్16.అక్షర టైమ్స్:**- తూర్పుగోదావరి జిల్లా, జగ్గంపేట నియోజకవర్గం, గోకవరం గ్రామం తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రామసేన సభ్యులు, భారతీయ జనతా పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బత్తుల నానాజీ, పెద్దాడ వెంకన్న దొర, కరిబండి వెంకటేశ్వరావు, పసల గణేష్, తాటికొండ సురేష్, నెల్లి శ్రీను, తుమ్మల బుజ్జి, గని రాజు, సోషల్ మీడియా కన్వీనర్ ఆదం మణికంఠ, సుబ్బారావు, రామసేన సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం



**బోనకల్,ఏప్రిల్16.అక్షర టైమ్స్:**–బోనకల్ మండలానికి చెందిన 12 మందికి ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి రామసహాయం సిఫార్సుతో మంజూరు అయిన సుమారు 427500 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను తంబూరి దయాకర్ రెడ్డి అందజేసినారు.. దయాకర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రతి పేదవాడికి ప్రజా సంక్షేమ పథకాలు అందజేయటంలో ప్రజా ప్రభుత్వం ముందు ఉందని అన్నారు. లబ్ధిదారులు ఎంపీ రఘురాం రెడ్డి కి సీఎం రేవంత్ రెడ్డి కి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కి రెవిన్యూ గృహ నిర్మాణ శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మరియు బోనకల్ మండల నాయకులు భాగం నాగేశ్వరరావు మొదలగు వారు పాల్గొన్నారు

# నూతన రేషన్ షాప్ ను ఏర్పాటు చేయాలి

తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ



**బోనకల్,ఏప్రిల్16.అక్షర టైమ్స్:**–బోనకల్ గ్రామపంచాయతీలోని 12వ వార్డు ప్రజలు రావినూతల గ్రామపంచాయతీలోని 12వ వార్డు ప్రజలు రేషన్ బియ్యం కోసం సుమారు రెండు కిలోమీటర్ల వెళ్లవలసి వస్తుందని, సుమారు 600 జనాభా కలిగిన ఈ ప్రాంతంలో నూతన రేషన్ షాపు ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రావినూతల గ్రామంలోని 12వ వార్డులో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, అర్హులైన పేదవారందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, నూతన సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, మండల కేంద్రంలో నెలకొని ఉన్న రైల్వే ట్రాక్ అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని, బస్టాండ్ బస్సులు వచ్చేల చర్యలు తీసుకోవాలని, అధికారులను కోరారు. ఈ కార్యక్రమం లో డీసీసీబీ మాజీ డైరెక్టర్ భోజడ్ల అప్పారావు, నారాయణ పురం వైస్ సర్పంచ్ కరివేద కనక రావు లు అధికారులకు వినతిపత్రం అందచేశారు.

# అధికారులు సకాలంలో విధులు హాజరవ్వాలి

– ప్రజా సమస్యలు పరిష్కరించాలి

– సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు



**బోనకల్,ఏప్రిల్16.అక్షర టైమ్స్:**–ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశంలో అధికారులు సకాలంలో విధులకు హజరై ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజాపాల–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. 99 రోజుల కార్యచరణలో మండలంలోని ప్రజాసమస్యలు పరిష్కారమయ్యే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. అధికారుల సకాలంలో విధులకు హజరవ్వడం లేదని సంవత్సరాలు తరబడి విధులకు హజరవ్వకుండా జీతాలు తీసుకున్న అధికారులు ఉన్నారని ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయంలో ధృవీకరణ పత్రాల మంజూరు తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు త్రాగునీటిని ఏర్పాటు చేయాలని కోరారు. వేసవి కావడంతో ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా సకాలంలో పనులు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లలో బెస్మెంట్లు, సన్నసైడ్లు నిర్మించిన వారికి రెండో విడతలో ప్రాధాన్యత కల్పించి మంజూరు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లలో అర్హులైన మరికొందరిని ఎల్1, ఎల్2, ఎల్3 లిస్టులోకి చేర్చాలని కోరారు. బోనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట రింగ్, ఆర్వోబి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలోని అన్ని వైకుంఠధామాలు, స్మశానవాటికలలో బోర్లు వేయించి విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేయడంతోపాటు ట్యాపులను ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్వోబి కింద ఖాళీ చేయించిన చిరువ్యాపారులకు అర్‌అండ్బి పక్కన ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో షాపింగు కాంప్లెక్సు ఏర్పాటు చేసి నామమాత్రపు అద్దెకు ఇవ్వాలని కోరారు. నూతన పెక న్లు మంజూరు చేయాలని, యువతకు ఉపాధి మార్గాలను చూపాలని కోరారు.ద

# అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని పేదల ఆకలి తీసిన సూర్యోదయ సంస్థ





**శంఖవరం,ఏప్రిల్16.అక్షర టైమ్స్:** –తుని పట్టణం గొల్ల అప్పారావు సెంటర్, బస్టాండ్ ప్రాంతాలలో పేదలకు, వృద్ధులకు, వికలాంగులకు సూర్యోదయ సేవా సంస్థ భోజన ప్యాకెట్లు పంపిణీ చేసి వారి ఆకలి తీర్చింది. దీనికి సూర్యోదయ సంస్థ అధ్యక్షులు మాదన సుబ్బారావు మేనేజింగ్ డైరెక్టర్ భూపతి రాజు ఇందుకు సహకరించారు. ఈ కార్యక్రమంలో సూర్యోదయ సంస్థ రొంగల అర్జున్, సతీష్, రవితేజ పేదలకు ఫుడ్ ప్యాకెట్లు పంచిపెట్టారు. సూర్యోదయ సేవా సంస్థ పేదల ఆకలి తీర్చడంలో ఎప్పుడూ ముందే ఉంటుంది. పేదలు కడుపు నింపి వారి కళ్లలో ఆనందం చూడాలని సూర్యోదయ సేవా సంస్థ చేస్తున్న ప్రయత్నాన్ని ప్రజలు అభినందించారు.

# లింగంపర్తిలో పోషణ పక్వాడ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

– పిల్లలను జంక్ ఫుడ్ కు, మొబైల్స్ స్క్రీన్లకు దూరంగా ఉంచాలి



**ఏలేశ్వరం,ఏప్రిల్16.అక్షర టైమ్స్:**–కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామంలో ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ సిడిపిఓ పద్మావతి ఆదేశాలతో 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రత్తిపాడు ప్రాజెక్ట్ భద్రవరం సెక్టార్ సూపర్వైజర్ సూర్య కుమారి అద్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రనానికి ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ పరిధి అంగన్వాడి కేంద్రాలలో 15 రోజులు పాటు ఈ పోషణ పక్వాడ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు.ఈ చిన్నారులకు రెండు సంవత్సరాల వయస్సు వచ్చేసరికి మెదడు 80 శాతం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. నాయనమ్మ, తాతయ్య,అమ్మమ్మ తదితరులు పిల్లలకు మంచి మంచి కథలు చెప్పడం ద్వారా వారు మెదడు అభివృద్ధిపై ప్రేరణ కలుగుతుందని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లలను చెడు వ్యసనాలైన ఐస్ క్రీం,చక్కెర వంటి పదార్థాలకు స్క్రీన్ టీవీ మొబైల్ ఫోన్ వంటి వాటికి దూరంగా ఉంచాలని కోరారు.తమ తమ పిల్లలకు ఇంటి లోపల మరియు బయట ప్రదేశాలలో ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు సూచించారు.దీని ద్వారా శారీరక నైపుణ్యాలు మెరుగుపడతాయని సామాజిక భావోద్వేగా వికాసం పెరుగుతుందన్నారు. మంచి పోషకాలు అందించాలని దీని ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మెదడు అభివృద్ధికి సహాయపడుతుందని ఈ సందర్భంగా వారన్నారు.ఈ కార్యక్రమంలో గర్భిణీ బాలింతలు ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లల తల్లులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.అనంతరం బాలింతలకు పోషక పదార్థాలను అందించారు.చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే ప్రక్రియ అంగన్వాడి కేంద్రాల ద్వారానే ప్రారంభమవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు,లింగంపర్తి చైర్మన్ పెంటకోట మోహన్ వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి లక్ష్మణరావు,మండల తెలుగు యువత అధ్యక్షులు పెంటకోట శ్రీదర్,ఎస్సీ సెల్ కన్వీనర్ నూకతాటి ఈశ్వరుడు,కూటమి నాయకులు, పెంటకోట కృష్ణ,ఎంపీడీవో రామరాజు వర్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్య కుమారి, పంచాయతీ కార్యదర్శి,ఐసిడిఎస్ టీచర్లు,హెల్పర్లు,ఏఎఎంలు,వెలుగు విఓఏలు, పలువురు గర్భిణీలు బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇంటర్‌లో పేదింట విరిసిన విద్యాకుసుమం..

– 464 మార్కులతో పేట చైత్ర మండల ఫస్ట్

– సాయి విద్యానికేతన్ జూనియర్ కాలేజీ విద్యార్థుల ప్రభంజనం





**పొదలకూరు,ఏప్రిల్16.అక్షర టైమ్స్:–** పేదరికాన్ని జయించి పట్టుదలతో ముందుకు సాగితే విజయాలు సాధ్యమేనని మరోసారి నిరూపించింది పేట చైత్ర.మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఈ విద్యార్థిని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అద్భుత ప్రతిభ కనబరిచి మండల ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.పొదలకూరు పట్టణంలోని సాయి విద్యానికేతన్ జూనియర్ కాలేజీలో ఎంపీసీ గ్రూపులో చదువుతున్న చైత్ర, మొత్తం 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించి అందరి ప్రశంసలు అందుకుంది.పొదలకూరు మండలం కొనగలూరు గ్రామానికి చెందిన చెంచుకృష్ణ, భాగ్యలక్ష్మి దంపతుల కుమార్తె చైత్ర. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా చదువుపై ఉన్న తపనతో ఆమె నిరంతరం శ్రమించింది.చైత్ర చదువుతో పాటు ఇంటి పనుల్లో తల్లికి సహాయం చేస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం విశేషం.ఒకవైపు కుటుంబ బాధ్యతలు, మరోవైపు చదువు..ఈ రెండింటినీ సమతుల్యంగా నిర్వహిస్తూ విజయం సాధించింది.

**కళాశాల ప్రోత్సాహం విజయానికి తోడ్పాటు**

చైత్రలో ఉన్న ప్రతిభను గుర్తించిన సాయి విద్యానికేతన్ కళాశాల యాజమాన్యం తక్కువ ఖర్చుతో విద్యను అందిస్తూ ప్రోత్సహించింది. విద్యార్థినిలో ఉన్న పట్టుదల, క్రమశిక్షణను ఉపాధ్యాయులు మెచ్చుకున్నారు.

**లక్ష్యం 'మెయిన్స్'.. ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు**

తన భవిష్యత్ లక్ష్యం మెయిన్స్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవడం అని చైత్ర తెలిపింది. తన విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే కారణమని వినమ్రంగా చెప్పింది.

**ఘనంగా సత్కారం.. అభినందనలు వెల్లువ**

మండల ప్రథమ స్థానం సాధించిన చైత్రను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. విద్యాసంస్థల చైర్మన్ బోడోలు వెంకటేశ్వర్లు, మేనేజింగ్ డైరెక్టర్ తూపిలి నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ,"మా విద్యార్థిని ఈ స్థాయిలో రాణించడం గర్వకారణం" అని పేర్కొన్నారు.జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ జివిబి రామానాయుడు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ కె. కోటేశ్వరరావు, అధ్యాపకులు చైత్రకు అభినందనలు తెలియజేశారు.

పేదరికం అడ్డంకి కాదు.. పట్టుదలే విజయ రహస్యం

పేట చైత్ర సాధించిన విజయం పేదరికం ఉన్నా ప్రతిభ, కృషి ఉంటే ఏదైనా సాధ్యమేనని విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తోంది.

## ఇంటర్ ఫలితాల్లో వివేక విద్యార్థుల ప్రభంజనం




**శంఖవరం, ఏప్రిల్16. అక్షర టైమ్స్:–** ఇంటర్మీడియట్ ఫలితాల్లో తుని వివేక జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలలో తుని పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచామని కళాశాల యాజమాన్యం ప్రకటించింది. వరుసగా 5 సంవత్సరాల పాటు ప్రథమ స్థానంలో నిలవడం విశేషమని, విద్యా సంస్థలలో గర్వకారణమని విద్యా సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎన్. సాయికృష్ణ 470 మార్కులకు గాను 465 మార్కులు, బైపీసీ విభాగంలో పి శివకృష్ణ 455 మార్కులకు గాను 448 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎస్. హారిక 1000 మార్కులకు గాను 988 మార్కులు, బైపీసీ విభాగంలో పి స్వర్ణ 1000 మార్కులకు గాను 986 మార్కులు సాధించి పట్టణంలో అగ్రస్థానంలో నిలిచారని వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ గరగా కృష్ణ, విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గరగా మధిలి మాట్లాడుతూ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు పట్టుదలతో విజయాలు సాధిస్తున్నారని తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో అగ్రస్థానంలో నిలిచిన విద్యార్థులను విశేషంగా అభినందిస్తూ, భవిష్యత్తులో ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ పి సూరిబాబు, ఎన్.వి.ఎ. నాయుడు, గోవిందరాజులు, వరప్రసాద్, వీర భాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.

## మాజీ సీఎం జగన్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్సీడీఎస్ ప్రతినిధి



**పొదలకూరు,ఏప్రిల్16.అక్షర టైమ్స్:–** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డిని రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ తెలంగాణ ఫైనాన్షియల్ అండ్ చీఫ్ అడ్వైజర్ బూసుపల్లి పెంచల రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని నివాసంలో జరిగిన ఈ సమావేశంలో పలువురు పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పెంచల రెడ్డి, వైఎస్ఆర్ సీపీ పార్టీ కార్యక్రమాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి తాను చేపడుతున్న చర్యలను కూడా వివరించినట్లు సమాచారం.దీనికి స్పందించిన జగన్ మోహన్ రెడ్డి, పెంచల రెడ్డిని అభినందిస్తూ పార్టీ కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొని, ప్రజలతో మమేకమై పార్టీకి బలం చేకూర్చాలని సూచించారు.ముఖ్యంగా గ్రామ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించి, తమ ప్రభుత్వం గతంలో చేపట్టిన సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించినట్లు తెలిసింది. రాబోయే రోజుల్లో వైఎస్ఆర్ సీపీ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## నూతన తహసిల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్ లు

– ప్రజలకు త్వరిత సేవలందించాలని తహసిల్దార్‌ను కోరిన సర్పంచ్ లు

– ప్రభుత్వ సేవలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలి: సర్పంచ్ లు




**పెన్ పహాడ్,ఏప్రిల్16.అక్షర టైమ్స్:**–పెన్ పహాడ్ మండలంలో ఇటీవల నూతన తహసిల్దార్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్ రెడ్డిని పలువురు గ్రామాల సర్పంచ్ లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అమలు అవుతున్న ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రజలకు అవసరమైన జనన, మరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఈబీసీ, ఫ్యామిలీ మెంబర్ ధ్రువీకరణ పత్రాలు వంటి సర్టిఫికెట్లను జాప్యం లేకుండా త్వరితగతిన జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ అంశాలపై తహసిల్దార్‌తో సర్పంచులు చర్చించారు. గ్రామాల నుండి వచ్చే ప్రజలకు అవసరమైన సేవలు ఎటువంటి ఆటంకాలు లేకుండా వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని సర్పంచులు విజ్ఞప్తి చేశారు. తహసిల్దార్‌ను కలిసిన వారిలో పెన్పహాడ్ సర్పంచ్ ఒగ్గు రవి, గాజుల మల్కాపురం సర్పంచ్ నాతాల వెంకటరెడ్డి, సింగరెడ్డి పాలెం సర్పంచ్ ఒగ్గు కిరణ్, తంగళ్ళగూడెం సర్పంచ్ పందుల వెంకటేశ్వర్లు, నాగులపహాడ్ సర్పంచ్ నిరంజన్ రెడ్డి ఉన్నారు.ద

# శ్రీకాళహస్తి వెళ్లే భక్తులకు గుడ్‌న్యూస్



– ఇకపై రూ.100లకే సామూహిక రాహు కేతు పూజలు!

శ్రీ కాళహస్తీశ్వరాలయంలో పలు మార్పులు చేసిన పాలక మండలి

– వెండి ధరలు పెరగడంతో రాహు కేతు పూజల ధరలు పెంపు

– పేదల కోసం ప్రత్యేకంగా రూ.100తో సామూహిక రాహు కేతు పూజలు

: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ పాలక మండలి పలు కీలక తీర్మానాలు చేసింది. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, ఈవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నేడు పాలక మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 14 అంశాలను చర్చించి, ఆమోదించారు. పేదలకు ఉపయోగకరంగా మొదటిసారి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నిరసిస్తూ, వైట్ రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రతి బుధవారం రూ.100తో సామూహిక రాహు కేతు పూజలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. అలాగే రూ.500 అంతరాలయ దర్శన టికెట్ కొన్న భక్తులకు ఉచితంగా లడ్డు, వడ ప్రసాదం పంపిణీ చేయాలని తీర్మానించారు.

" నేడు పాలక మండలి సమావేశంలో శ్రీ కాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నాం. ఈ సమావేశంలో 14 అంశాలను చర్చించి, ఆమోదించాం. పేదల కోసం రూ.100తో సామూహిక రాహు కేతు పూజలు నిర్వహిస్తాం. వెండి ధరలు పెరగడంతో రూ.500 రాహు కేతు పూజను రద్దు చేశాం. అలాగే రూ.5000 ఉన్న రాహు కేతు పూజను రూ.6000 పెంచాం. రూ.500 అంతరాలయ దర్శన టికెట్ కొన్న భక్తులకు ఉచితంగా లడ్డు, వడ ప్రసాదం పంపిణీ చేయాలని తీర్మానించాం." – ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి స్థల పురాణం: రాష్ట్రంలో శివుని అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా శ్రీకాళహస్తిలోని శ్రీకాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయం ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయాన్ని కాళా బుషి నిర్మించాడని స్థల పురాణం చెబుతోంది. సహజంగా ఏర్పడిన స్ఫటిక లింగం ఇక్కడి మరో ప్రత్యేకత. ఇది దక్షిణ భారతదేశం లోని అత్యంత ముఖ్యమైన పుణ్యక్షేత్రాలలో ఒకటిగా నిలుస్తోంది. ఈ ఆలయం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లాలో ఉంది. ఇక్కడ రాహు–కేతు సర్పదోష నివారణకు ప్రసిద్ధి.

# దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు

**స్పష్టం చేసిన కేంద్రమంత్రులు**

**ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో కూటమి నేతల సమావేశం**

**చంద్రబాబుతో పవన్ కల్యాణ్, మాధవ్, పల్లా శ్రీనివాస్ భేటీ**

**నారీ శక్తి వందన్ బిల్లుకు మద్దతుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చ**



లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని, జనాభా సంఖ్యతో సంబంధం లేకుండా అన్ని రాష్ట్రాల్లో 50 శాతం చొప్పున సీట్లు పెరుగుతాయని కేంద్ర మంత్రులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు స్పష్టం చేశారు. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్లు 50 శాతం పెంపు ఉంటుందని తేల్చి చెప్పటంతో పాటు దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని వివరించారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లుకి ఆమోదం ఘట్టాన్ని అమరావతి నుంచి వీక్షించే ఏర్పాటు చేయటంతో పాటు వైఎస్సార్సీపీ సహా అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్, పల్లా శ్రీనివాసరావులు నిర్ణయించారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో కూటమి పార్టీల నేతల సమావేశం జరిగింది. చంద్రబాబుతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, పల్లా శ్రీనివాసరావు సమావేశమయ్యారు. ఆ రెండు అంశాలకు సంబంధించిన ముసాయిదా బిల్లుల్లో పొందుపరిచిన అంశాలపై చర్చించారు. లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను 50 శాతం పెంచుతామని మాత్రమే ఆ బిల్లులో ఉందని, దాని వల్ల జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని కొన్ని రాజకీయ పార్టీలు లేవనెత్తుతున్న సందేహాలపై ప్రధానంగా చర్చ జరిగింది.

**3 పార్టీల నేతలు సంతృప్తి :** ఆ సందేహాల్ని నివృత్తి చేసుకునేందుకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్‌తో పాటు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడితో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో ఇప్పుడున్న లోక్‌సభ స్థానాలు 50 శాతం పెరుగుతాయని, అదే విషయాన్ని పునర్విభజన బిల్లులో కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంటుందని వారు స్పష్టతనిచ్చారు. దాంతో సంతృప్తి చెందిన కూటమి పార్టీల నేతలు ఆ బిల్లుని కలసికట్టుగా స్వాగతించాలని నిర్ణయించారు. కొందరు కావాలనే ఆ బిల్లుపై దుష్ప్రచారం చేస్తున్నారన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు 50 శాతం పెంచినప్పుడు ఒక లోక్‌సభ స్థానం పరిధిలోని సగటు జనాభాకి సంబంధించి రాష్ట్రానికి రాష్ట్రానికి మధ్య చాలా వ్యత్యాసానికి అవకాశం ఉందన్న చర్చ జరిగింది. ఈశాన్య రాష్ట్రాల్లో ఒక్కో లోక్‌సభ స్థానం పరిధిలో సగటు జనాభా చాలా తక్కువంటే, కేరళ వంటి అధిక జనాభా కలిగిన రాష్ట్రాలో 20 లక్షల వరకు ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో సగటు జనాభా మధ్యస్థంగా ఉంటుందన్న చర్చ జరిగింది. అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య కూడా 50 శాతం పెంచే అంశాన్ని పునర్విభజన ముసాయిదా బిల్లులో ప్రస్తావించకపోవడంపై కేంద్ర మంత్రులతో కూటమి నేతలు చర్చించారు. ఆ అంశం ముసాయిదాలో ప్రస్తావించకపోయినా, పార్లమెంటులో చర్చ సందర్భంగా దానిపై స్పష్టతనిస్తామని, కానిపక్షంలో అసెంబ్లీ సీట్లు 50 శాతం పెంచే అధికారాన్ని పునర్విభజన కమిటీకే ఇస్తామని కేంద్ర మంత్రులు స్పష్టం చేసినట్టు తెలిసింది. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ బిల్లుకి ఈ నెల 17న పార్లమెంటు ఆమోదం తెలిపే చారిత్రక ఘట్టానికి సంబంధించిన ప్రత్యక్ష ప్రసారాన్ని అమరావతి వేదికగా అన్ని పార్టీల నాయకులు, మహిళలు కలిసి వీక్షించే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ రోజున అమరావతిలో 2-3 వేల మంది కూర్చుని వీక్షించేలా భారీ వేదిక ఏర్పాటు చేయనున్నారు. మహిళా బిల్లుని రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు స్వాగతిస్తున్నందున ఆ కార్యక్రమానికి వైసీపీ సహా అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని నిర్ణయించారు. ప్రజాప్రతినిధులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని, బిల్లుకి ఆమోదం లభించిన సందర్భాన్ని ఒక ఉత్సవంలా చేయాలని నిర్ణయించారు. వీక్షించేలా ఏర్పాట్లు: అమరావతితో పాటు, అన్ని నియోజకవర్గాల్లో ఆ కార్యక్రమాన్ని వీక్షించేలా ప్రత్యేక తెరలు ఏర్పాటు చేయాలన్న సూచన వచ్చింది. జిల్లా, నియోజకవర్గాల స్థాయిలోను భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించి సోదరీమణులకు శుభాకాంక్షలు, ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలపాలని నిర్ణయించారు. దాదాపు రెండున్నర గంటలపాటు వీరి సమావేశం జరిగింది. కొన్ని పార్టీలు చెప్తున్నట్లుగా దక్షిణాది రాష్ట్రాల్లో 50 శాతం సీట్లు పెంపు లేదనే వాదనపై కేంద్ర పెద్దల నుంచి నేతలు స్పష్టత తీసుకున్నట్లు సమాచారం. కేంద్ర న్యాయశాఖ మంత్రితో పాటు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి మరికొందరితోనూ మాట్లాడి బిల్లుపై స్పష్టత తీసుకుని వారిచ్చిన వివరణతో 3 పార్టీల నేతలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లులో దక్షిణాది రాష్ట్రాలకు 50 శాతం సీట్లు పెంపుపై కేంద్రం నుంచి కూటమి నేతలకు స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. 50 శాతం నియోజకవర్గాల సీట్లు పెంపుపై దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదని దీనిని రాజకీయంగా కలసి కట్టుగా స్వాగతించాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్ నిర్ణయించారు. కొందరు చేసేది అనవసర దుష్ప్రచారమని ఈ సందర్భంగా నేతలు నిర్ధారించుకున్నట్లు సమాచారం. జనాభా తో సంబంధం లేకుండా దక్షిణాదికి రాజకీయంగా నష్టం లేకుండానే బిల్లు రూపొందిందని కేంద్ర పెద్దల నుంచి నేతలు ఈ మేర స్పష్టత తీసుకున్నట్లు తెలుస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా నేతలు చర్చించారు. 3 పార్టీల నేతలు కలిసి పెద్ద తెరపై కార్యక్రమం వీక్షించే ఏర్పాటు ఉంటే బాగుంటుందనే పవన్ ప్రతిపాదనకు అంగీకారం తెలిపిన సీఎం ప్రజా ప్రతినిధులందరినీ భాగస్వాముల్ని చేసేలా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. జిల్లా, నియోజకవర్గాల స్థాయిలోనూ భారీ ఎత్తున కార్యక్రమాలు చేపట్టి మహిళా సోదరీమణులకు, ప్రధానికి ధన్యవాదాలు తెలపాలని నిర్ణయించారు. అన్ని నియోజకవర్గాల్లో లైవ్ స్ట్రీమింగ్‌లు ఏర్పాటుకు ఆమోదం తెలిపారు.

# దైవ దర్శనానికి వెళ్తుండగా ఘోర ప్రమాదం - 8 మంది మృతి

**కర్నూలు జిల్లాలో బొలెరో వాహనం**


**లారీ ఢీకొని ప్రమాదం**

**ఘటనలో 8 మంది మృతి,**

**12 మందికి గాయాలు**

**మృతులు కర్ణాటకలోని చిక్ మంగళూరుకు**

**చెందిన వారిగా గుర్తింపు**



ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మంత్రాలయం మండలంలోని చిలకలడోన వద్ద బొలెరో-రెడీమిక్స్ వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో 8 మంది మృతి చెందగా, 12 మంది క్షతగాత్రులయ్యారు. వారిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరులోని హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాద ఘటనా స్థలంలోనే ఐదుగురు మృతి చెందగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌మంగళూరుకు చెందిన భక్తులు మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

**మృతుల వివరాలు :** ఈ ఘోర ప్రమాద ఘటనలో మృతులు కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌మంగుళూరు కనయాకనహళ్లి ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. వాసులు కుమార్(60), సునీల్(40), దీపిక వీణ(35) బెల్లి(3 ఏళ్లు), మీనాక్షి(50 ఏళ్లు), పుట్టమ్మ, తాయమ్మ(60), లోలాక్షిగా గుర్తించారు.

**దైవదర్శనానికి వెళ్తుండగా :** కర్ణాటకలో రాష్ట్రంలోని చిక్‌మంగళూరుకు చెందిన కొందరు భక్తులు మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారమందుకున్న వెంటనే పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో బొలేరో వాహనంలో 23 మంది ఉన్నట్లుగా పోలీసులు వివరించారు. "చిలకలడోన గ్రామం దగ్గర నేషనల్ హైవే 167 పైన రోడ్డు ప్రమాదం జరిగింది. బీదర్ నుంచి టుముకూరు వైపుగా వెళ్తున్న రెడీమిక్స్ లారీని ఎదురుగా వస్తున్న, మంత్రాలయం వెళ్తున్న వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళలు, మూడేళ్ల వయసున్న బాలిక, ఇద్దరు పురుషులు మృతి చెందారు. గాయపడ్డ వారిలో ఏడుగురిని కర్నూలోని ఆస్పత్రికి తరలించగా, మరో నలుగురు ఎమ్మిగనూరులో చికిత్స పొందుతున్నారు. ఒక వ్యక్తి పరిస్థితి నిలకడగా ఉంది. మరిన్ని వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది .

**మృతులకు ప్రధాని సంతాపం :** మంత్రాలయం రోడ్డు ప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబాలకు కేంద్రం తరఫున రూ.2లక్షల చొప్పున పరిహారాన్ని మోదీ ప్రకటించారు.

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు :** రోడ్డు ప్రమాద దుర్ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోవడంపై ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన పట్ల విచారణ జరిపించాలని ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర మంత్రులు భరత్, జనార్దన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

**మితిమీరిన వేగమే ప్రాణం తీస్తోందా? :** ఇటీవల జరుగుతోన్న వరుస ప్రమాదాలతో ప్రజలు బెంబేళెత్తిపోతున్నారు. చాలా ఘటనల్లో మితిమీరిన వేగం, మద్యం సేవించి, నిర్లక్ష్యపూరితంగా డ్రైవింగ్ చేయడం లాంటివి కారణమవుతున్నారు. రాష్ట్రంలో రోజూ ఏదో చోట రోడ్లు నెత్తురోడుతూనే ఉన్నాయి. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ట్రాఫిక్ పోలీసులు ఎంతగా చెబుతున్నప్పటికీ వాహనదారులు పెడచెవిన పెట్టడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. కర్నూలు బస్సు ప్రమాద ఘటన మర్చిపోకముందే మరో ప్రమాదం జరగడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# రాబోయే 3 రోజులు మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లొద్దు

**ఆరోగ్య శాఖ హెచ్చరికలు**

**రాష్ట్రంలో ఠారెత్తిస్తున్న ఎండలు**

**వచ్చే మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు**

**అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న ఐఎండీ**



రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిర్మల్ జిల్లాలోని తానూరులో 43.5 డిగ్రీలు, నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో 43.2 డిగ్రీలు నమోదయ్యియి. కామారెడ్డి జిల్లాలోని మద్నూల్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్, మంచిర్యాల జిల్లాలోని భీమారం, నల్గొండ జిల్లాలోని అడవి దేవులపల్లిలో 43.4 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 43 డిగ్రీల మేరకు ఉష్ణోగ్రతలు ఉన్నాయి. రానున్న మూడు రోజులు ఉష్ణోగ్రతలు ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశముందని హైదరాబాద్ ఐఎండీ కేంద్రం వెల్లడించింది. బుధవారం 33 కేంద్రాల్లో 41 నుంచి 43.5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపింది. 'ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సగటున 43.3 డిగ్రీలు నమోదయ్యింది. గురువారం ఆదిలాబాద్, కుమురం భీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీచే అవకాశముంది. శుక్ర, శనివారాల్లో సైతం పై జిల్లాలతో పాటు నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాలో వడగాలులు వీస్తాయ'ని ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. ఈ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశముందని వాతావరణ విభాగం పేర్కొంది.

**అప్రమత్తమైన ఆరోగ్య శాఖ :** తెలంగాణలో రాబోయే 3 రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. వడదెబ్బ బాధితులకు సత్వరమే చికిత్స అందించే విధంగా ఆస్పత్రుల్లో అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల మధ్య బయటకు వెళ్లొద్దని సూచించారు. దీంతోపాటు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆసుపత్రులకు, ప్రజలకు సూచిస్తూ వైద్యారోగ్యశాఖ బుధవారం ఒక ప్రకటనను విడుదల చేసింది.

**ఆరోగ్యశాఖ సూచించిన జాగ్రత్తలు ఇవే :** ప్రజలు మధ్నాహ్నం 12-3 గంటల మధ్య బయటకు వెళ్లకూడదు

రోజూ తగినంత ఓఆర్ఎస్, మజ్జిగ, నిమ్మరసం తీసుకోవాలి

బయటకు వెళ్లేటప్పుడు తలకు టోపీ, టవల్ లాంటివి ధరించాలి

ఆయిల్, మసాలా ఫుడ్ తినడం తగ్గించాలి

వడదెబ్బ లక్షణాలు గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఐవీ ఫ్లూయిడ్స్, అవసరమైన మందులు సిద్ధం చేసుకోవాలి

గ్రామాల్లో ఏఎన్ఎం, ఆశా సిబ్బంది ద్వారా ఓఆర్ఎస్ పంపిణీ ముమ్మరం చేయాలి

**లక్షణాలు :**

శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరగడం

తల తిప్పడం

వాంతులు

గుండె వేగంగా కొట్టుకోవడం

అపస్మారక స్థితికి చేరుకోవడం

పైన వివరించిన లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని ఆరోగ్య శాఖ సూచించింది.

సత్వర చికిత్స అందించేందుకు ఏర్పాట్లు : వడ దెబ్బ బాధితులకు వేగవంతమైన, మెరుగైన వైద్య చికిత్సను అందించేందుకు వీలుగా అన్ని హాస్పిటల్స్‌లో ప్రత్యేకంగా డాక్టర్ల బృందాలు ఏర్పాటు చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డా. గౌరవ్ ఉప్పల్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

**ప్రజలకు అవగాహన కల్పించండి :** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔట్ పేషెంట్లు, ఔట్ పేషెంట్ల వారి అటెండెంట్లు, ఆస్పత్రి సిబ్బందికి తాగు నీరు అందుబాటులో ఉంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అవసరమైన చోట చలివేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉక్కపోత సమస్య ఎక్కువవుతున్నందున ఏసీలు, కూలర్లు, ఫ్యాన్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కార్మికులు వడ దెబ్బ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారిని దృష్టిలో పెట్టుకుని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పేషెంట్ వచ్చిన వెంటనే చికిత్స ప్రారంభించే విధంగా ప్రత్యేక బృందంలోని సిబ్బందికి అవసరమైన శిక్షణను ఇవ్వాలన్నారు. అన్ని ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

# 'జవాబుపత్రాల్లో డబ్బులు పెట్టాను

**నన్ను ఎలాగైనా పాస్ చెయ్యండి'**

**బోర్డు అధికారులకు ఫోన్ చేసి తనను ఎలాగైనా పాస్ చెయ్యాలని కోరిన విద్యార్థి**

**ఫోన్‌లోనే కౌన్సిలింగ్ ఇచ్చి అతని తల్లిదండ్రులతో మాట్లాడిన అధికారులు**




పరీక్షలు అంటే అందరికీ ఒకింత ఆందోళన ఉంటుంది. ఎంత బాగా ప్రిపేర్ అయినప్పటికీ చాలా మంది పరీక్ష అనగానే భయపడిపోతారు. ఇక పిల్లల పరిస్థితి అయితే చెప్పనక్కర్లేదు. పరీక్షలు ఒకెత్తు, ఫలితాలు అంతకు మించి టెన్షన్ పెడ్తాయి. రిజల్ట్ తెలిసే రోజు పది రెట్లు ఎక్కువ భయాందోళనకు గురవుతుంటారు. కొందరు సున్నిత మనస్కులు ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్న ఘటనలు చూస్తూనే ఉన్నాం. కానీ కొందరు విద్యార్థులు పరీక్ష సరిగా రాయకపోవడంతో తమని పాస్ చెయ్యాలంటూ ప్రాదేయపడుతూ జవాబు పత్రంలోనే బతిమాలుతూ వినతులు రాయడం చాలానే చూశాం. మరికొందరు బెదిరింపులకు పాల్పడతారు, ఇంకొందరు ఇంకోలా, తమకు తోచినట్లు ఏదో ఒక కహానీ అల్లుతారు. కానీ ఓ విద్యార్థి ఇవన్నీ చేసినప్పటికీ మళ్లీ ఫలితాల రోజు ఏకంగా ఇంటర్ బోర్డ్ అధికారులకే ఫోన్ చేశాడు. తనను పాస్ చెయ్యలని కోరాడు. అతని సంగతేంటో తెలుసుకోవాలంటే ఈ కథనం చదవాల్సిందే.

**ప్రశ్నాపత్రాన్నే మూడుసార్లు రాశా:** నిన్న బుధవారం ఇంటర్మీడియర్ పరీక్షల ఫలితాలు వచ్చిన సంగతి తెలిసిందే. విశాఖకు చెందిన సెకండ్ ఇయర్ విద్యార్థి ఒకరు తాను ఫెయిల్ అవుతాననే భయంతో ఫలితాలు వెలువడక ముందు ఇంటర్ బోర్డు అధికారులకు ఫోన్ చేశాడు. ఏదో ఒక విధంగా తనను పాస్ చేయాలని కోరాడు. జవాబుపత్రాల్లో డబ్బులు కూడా పెట్టానని చెప్పాడు. అంతే కాకుండా తానూ ఏమీ చదవకపోవడంతో ప్రశ్నాపత్రాన్నే మూడుసార్లు రాశానని తెలిపాడు. విద్యార్థి మాటలు విని షాక్ అయిన అధికారి, వెంటనే అప్రమత్తమయ్యారు.

**తల్లిదండ్రులతో మాట్లాడిన అధికారులు:** అధికారులు ఆ విద్యార్థికి ఫోన్‌లోనే కౌన్సిలింగ్ ఇచ్చారు. త్వరలోనే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఉన్నాయని వాటికోసం చదువుకోవాలని సూచించారు. ఆ తర్వాత విశాఖ ఆర్ఐఓకు ఈ సమాచారం చేరవేశారు. ఈ విషయమై వెంటనే అతని తల్లిదండ్రులకు తెలపాలని చెప్పారు. అనంతరం జిల్లా అధికారులు ఆ విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి జరిగింది చెప్పారు. తమ కుమారుడు ఎటువంటి తొందరపాటు నిర్ణయం తీసుకోకుండా జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన ఈ విద్యార్థి ఫస్టియర్ రెండు సబ్జెక్టులు, సెకండియర్ మూడు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాడు. అప్పటికే ఆ విద్యార్థి ఇంట్లోనే ఉన్నందున తాము జాగ్రత్తగా చూసుకుంటామని తల్లిదండ్రులు అధికారులకు తెలియజేశారు.

**సప్లిమెంటరీ పరీక్షలు:** రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఏప్రిల్ 20 నుంచి 27వ తేదీ వరకూ అవకాశం కల్పించాయి. మే 21 నుంచి జూన్ 4 వరకూ థియరీ సప్లిమెంటరీ పరీక్షలు, జూన్ 7 నుంచి 11 వరకూ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. జూన్ 5న ఎథిక్స్, హ్యూమన్ వాల్యూ, జూన్ 6న పర్యావరణ విద్య పరీక్షలు జరగనున్నాయి.

# పేదరికానికి కులం కూడా ఓ కారణమే!

**సమగ్ర కుటుంబ సర్వేలో షాకింగ్ నిజాలు**

**గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ మంది పేదలు**

**వార్షికాదాయం లక్షలోపు ఉన్నవి 1.1 కోట్ల కుటుంబాలు**

**కుటుంబ సర్వే నివేదికను ప్రభుత్వానికి అందించిన స్వతంత్ర నిపుణుల కమిటీ**



ఆర్థిక పరిస్థితులు వెనకబాటుకు ప్రధాన కారణమైనా, కులం అనేది పేదరికానికి సంబంధించి అన్ని స్థాయిల్లోనూ బలమైన ప్రభావం చూపిస్తోందని స్వతంత్ర నిపుణుల కమిటీ వెల్లడించింది. పేదరికమనేది కులంతో బలంగా ముడిపడిన అంశమని తెలిపింది. తెలంగాణ సామాజిక, ఆర్థిక, కుటుంబ సర్వే నివేదికను అధ్యయనం చేసిన స్వతంత్ర నిపుణుల కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది.

**నివేదికలో ఏముందంటే? :** దేశంలో కులం లేదు, కేవలం పేదరికం మాత్రమే ఉంది. పేదరికానికి కులాన్ని కలిపి అణచివేతకు గురవుతున్నారని కొందరు అభిప్రాయ పడుతున్నారు. అయితే ఇప్పటికీ వెనకబాటుకు, పేదరికానికి కులం ప్రధాన కారణమని బలంగా చెప్పేవారూ ఉన్నారు. నిపుణుల కమిటీ ఈ విషయమై సమగ్ర సర్వే నివేదిక ద్వారా అధ్యయనం చేసింది. ఆ ఆధ్యయనంలో తెలుసుకున్న విషయాలివే!పట్టణ ప్రాంతాల కన్నా గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ మంది పేదలు నివసిస్తున్నారని, పట్టణాలతో పోల్చితే గ్రామాల్లో భూమి యాజమాన్యం ఎక్కువగా ఉన్నప్పటికీ పేదలు అక్కడే ఎక్కువగా ఉన్నారని తేలింది. జనరల్ కులాల కన్నా బీసీలు, బీసీల కన్నా ఎస్టీలు, ఎస్టీల కన్నా ఎస్సీల పేద కుటుంబాలు జీవనోపాధి సూచికల్లో వెనకబడి ఉన్నాయి.

**సర్వేలో వార్షిక ఆదాయాన్ని పరిశీలిస్తే :**

సర్వేలో కుటుంబాల వార్షికాదాయాన్ని గణకులు అడిగినప్పుడు 12 రకాల ఆదాయ పరిమితుల్లో ఆయా కుటుంబాలు ఏడాదికి రూ.50 వేల నుంచి రూ.కోటికి పైగా ఉందని వెల్లడించాయి. పేదరికాన్ని పరిశీలించేందుకు సర్వేలో రూ.లక్ష కన్నా తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలను పరిగణనలోకి తీసుకుంటే దాదాపు 1.1 కోటి కుటుంబాలున్నాయి. వాటిలో 63.4 లక్షలు బీసీ, 21.5 లక్షల ఎస్సీ, 14.3 లక్షల ఎస్టీ, 9.2 లక్షల జనరల్ కులాలున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 242 కులాల్లో బీసీల్లో యాదవులు, ముదిరాజ్‌లు, ఎస్సీలో మాదిగలు, ఎస్టీల్లో లంబాడీలే ఎక్కువ పేదలుగా ఉన్నారు. వీరిందరికీ సంవత్సరానికి రూ.లక్షలోపు వార్షిక ఆదాయం వస్తుంది. ఇందులో 1.1 కోట్ల కుటుంబాల్లో 40 శాతం వరకు వీరు, మిగత నాలుగు కులాల జనాభా 33 శాతం మాత్రమే ఉంది. జనరల్ కులాల్లోని పేదలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ పేదలకు మధ్య వెనకబాటులో వ్యత్యాసాలు, అసమానతలు పోల్చేందుకు 14 రకాల సామాజిక, విద్య, ఉద్యోగాలు, జీవన ప్రమాణాల సూచికలను పరిశీలించగా, మిగతా వర్గాల్లో కులం ఎంత ముఖ్యమైందో పేదల్లోనూ కుల ప్రభావం అంతే బలంగా ఉంది.

**పేదరికం ఇలా..**

| కేటగిరీ | పేదరిక (శాతం) |
|---|---|
| బీసీ | 58.4 |
| ఎస్సీ | 19.7 |
| ఎస్టీ | 13.2 |
| **జనరల్** | **8.5** |

**అట్టడుగున ఎస్సీ, ఎస్టీ, బీసీలు :** వెనకబాటు సూచీ అందరి పేదల్లో ఒకేలా లేదు. రూ.లక్ష కన్నా ఆదాయం తక్కువ ఉన్న కుటుంబాల్లో 13 రకాల వెనకబాటు అంశాలు పరిశీలించినప్పుడు విద్య నుంచి మరుగుదొడ్లు, రిఫ్రిజిరేటర్లు, విద్యుత్తు సౌకర్యం కలిగిన గృహాలు, రోజువారీ వేతన కార్మికులు, బాల కార్మికులు, కులాంతర వివాహాలు, ఆర్థిక రుణ భారాల వరకు ప్రతి దానిలోని జనరల్ కులాల కన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీలు అధ్వానస్థితిలో ఉన్నారు. పేద కుటుంబాల్లోని జనరల్ కులాలకు చెందిన 40 శాతం మంది పిల్లలు ప్రైవేటు స్కూల్స్‌లో చదువుతున్నారు. ఇంగ్లీష్ మీడియంలో చదువుతున్న పేద కుటుంబాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు కూడా ఇదే పరిస్థితులు ఉన్నాయి. సంవత్సరానికి రూ.లక్ష ఆదాయం కలిగిన 56 కులాల్లో పేదల వెనుకబాటు సూచీని పరిశీలిస్తే, వెలమల్లో తక్కువ వెనకబాటు ఉంటే ఎస్సీ బేడల్లో అత్యధిక వెనకబాటు కనబడుతుంది.

# తూర్పు కనుమలను కాపాడండి



తూర్పు కనుమలు ఉత్తరాంధ్ర జీవనాడి. ప్రస్తుతం ఈ కనుమలు ప్రమాదం అంచున ఉన్నాయి. అడవులను నరకడం వల్ల ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఉత్తరాంధ్రకు నీటిని అందించే అనేక వాగులు... తూర్పు కనుమలు ఉత్తరాంధ్ర జీవనాడి. ప్రస్తుతం ఈ కనుమలు ప్రమాదం అంచున ఉన్నాయి. అడవులను నరకడం వల్ల ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఉత్తరాంధ్రకు నీటిని అందించే అనేక వాగులు, వంకలు ఎండిపోయే ప్రమాదం ముంచుకొస్తోంది. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం నడుం బిగించాలి. ఈ వాగు వంకల పరీవాహక ప్రాంతంలో చెట్లు లేకపోవడంతో వన్య మృగాలు, పలు జాతుల పక్షులు అంతరించిపోయాయి. గిరిజనులకు కూడా అడవి నుంచి వచ్చే ఫలసాయం తగ్గిపోయింది. కేవలం చింత, పనస వంటి అటవీ ఫలసాయం మాత్రమే ప్రస్తుతం గిరిజనులకు లభిస్తోంది. వీరికి ఆదాయం లేకపోవడంతో మనుగడ సమస్య ఏర్పడింది. వీరు ఇప్పుడు మైదానాలకు వలసపోతున్నారు. ఈ పరిస్థితిని తప్పించేందుకు ప్రభుత్వం ఒక సమగ్రమైన ప్రణాళికను రూపొందించాలి. ఉత్తరాంధ్రకు రాబోయే నీటి కొరతను తప్పించాలంటే ఆ వాగు వంకల ప్రవాహాల వెంట మనం అడవులను సృష్టించాలి. విస్తృతంగా పండ్ల మొక్కలను నాటాలి. స్థానికంగా ఉండే మొక్కలతో అడవులను పెంచడం వల్ల పర్యావరణ సమతుల్యతను కాపాడినవాళ్లం అవుతాము. కాఫీ ప్లాంటేషన్లకు నీడ కోసం వాడుతున్న సిల్వర్, ఓక్ వంటి విదేశీ జాతుల మొక్కల పెంపకాన్ని తగ్గిస్తే మంచిది. స్థానికంగా పెరిగే తెల్ల మద్ది, నల్ల మద్ది, మామిడి, జామ, ఉసిరి, చింత వంటి మొక్కల ద్వారా అడవులు పెంచి కాఫీ, మిరియాల వనాలను వృద్ధి చేయాలి. తద్వారా గిరిజనులకు ఉపాధి లభిస్తుంది. జంతువులకు, పక్షులకు ఆహారమూ లభిస్తుంది. తూర్పు మన్యంలో నిమ్మ జాతి మొక్కలు విరివిగా పెరుగుతాయి. కాబట్టి నిమ్మ, నారింజ, బత్తాయి, కమల, పంపర పనస వంటి మొక్కలను పెంచాలి. మన్యంలో పండే రాజ్మా చిరుధాన్యాలు వంటి ఉత్పత్తులను కూడా విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చవచ్చు. మిరియాలు, కాఫీ, పసుపు, పనస ఆధారంగా మనం విలువ జోడించే సముదాయాలను రూపొందించటం వల్ల వేలాది మంది గిరిజనులకు ఉపాధి లభిస్తుంది. ఈ మన్యంలో పనస ఎక్కువగా పండేందుకు అనుకూలమైన వాతావరణం ఉంటుంది. అయితే పనస తక్కువగా పండే రాష్ట్రాల్లో పనస విలువ ఆధారిత ఉత్పత్తుల మీద ఎక్కువ ప్రయోగాలు జరుగుతున్నాయి. కానీ విస్తృతంగా పనస పండే తూర్పు మన్యంలో ఈ సౌకర్యాలు గానీ, శిక్షణ గానీ లేదు! స్థానికంగా లభించే వెదురు, కలపతో వస్తువులు, బొమ్మలు తయారు చేయడం గిరిజనులకు నేర్పించాలి. ఇది వారికి ఆదాయాన్ని ఇస్తుంది. పండిన పంటకు విలువ జోడించడం మీద కూడా వారికి శిక్షణనివ్వాలి. వారు తరతరాలుగా ఆచరిస్తున్న కళలను ప్రభుత్వం పునరుద్ధరించాలి. ఇలా పర్యావరణంపై దృష్టి పెట్టడం ద్వారా నాలుగైదు సంవత్సరాల్లోనే తూర్పు మన్యాన్ని దట్టమైన అడవిగా, వర్షాన్ని గ్రహించే మంచి వనాలుగా మార్చవచ్చు. గిరిజనులున్న భూముల్లో అడవులతో పాటు వ్యవసాయ పర్యాటకాన్ని రూపొందించవచ్చు. ఇప్పటికే ఉన్న పర్యాటకానికి ఈ వ్యవసాయ పర్యాటకం ఊతం ఇస్తుంది. కొత్తగా ఉపాధి అవకాశాలు సృష్టించడానికీ వీలు కలుగుతుంది.

## మీ మెదడుకి పదును ఈ చిత్రం.. గొర్రెపిల్లలో ఉన్న ముఖాలు ఎన్నో చెప్పుకోండి చూద్దాం

అర్ష్‌దీప్ సోని అనే వినియోగదారు ఫేస్‌బుక్‌లో ఒక ఆప్టికల్ భ్రమ చిత్రాన్ని షేర్ చేశారు. ఇది



నెటిజన్లను కలవరపెడుతోంది. మొదటి చూపులో ఇది కొండ ప్రాంతంలో విశ్రాంతి తీసుకుంటున్న గొర్రెపిల్ల చిత్రంలా కనిపిస్తుంది. అయితే కళాకారుడు ఈ చిత్రంలో చాలా మానవ ముఖాలను తెలివిగా దాచిపెట్టాడు. ఈ ముఖాలను కనుగొనగలిగే వారిని మేధావులు అంటారు. ప్రస్తుతం ఒక ఆప్టికల్ భ్రమ చిత్రం సోషల్ మీడియాలో చక్కట్లు కొడుతోంది. ఇది మేథస్సుకి పదును పెడుతుంది. దీనిలో ఇంటర్నెట్ వినియోగదారులు గొర్రెపిల్లలా కనిపిస్తున్న ఆప్టికల్ భ్రమ ఫోటోలో దాగి ఉన్న మానవ ముఖాలను కనుగొనమంటూ సవాల్ విసిరారు. ఇటువంటి ఫోటో పజిల్స్ పరిశీలన నైపుణ్యాలను మెరుగుపరచడమే కాదు మీ విమర్శనాత్మక ఆలోచనను కూడా పెంచుతాయని తెలిసిందే. ఈ ఆప్టికల్ ఇల్యూషన్‌ను అర్ష్‌దీప్ సోని అనే యూజర్ ఫేస్‌బుక్‌లో షేర్ చేశారు. ఇది నెటిజన్లను ఆశ్చర్యపరిచింది. మొదటి సారి చూస్తే ఈ ఫోటోలో ఉంది ఇది కొండ ప్రాంతంలో విశ్రాంతి తీసుకుంటున్న గొర్రెపిల్లలా కనిపిస్తుంది. అయితే ఇది సాధారణ చిత్రం కాదు. ఇందులో కళాకారుడు చాలా మానవ ముఖాలను కూడా తెలివిగా దాచిపెట్టాడు. వాటిని గుర్తించే వ్యక్తిని మేధావి అని పిలుస్తారు. అయితే ఈ ముఖాలను వెంటనే గుర్తించడం కష్టం. అందుకే దీనిని ఆప్టికల్ భ్రమకు సరైన ఉదాహరణగా పిలుస్తున్నారు. ఈ డ్రాయింగ్‌లో మీరు ఎన్ని దాచిన ముఖాలను కనుగొనగలరనేది నిజమైన సవాలు. మరి మీరు ఈ సవాలును స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారా? ఇప్పుడు క్రింద ఇవ్వబడిన చిత్రాన్ని జాగ్రత్తగా చూసి.. మీరు ఎన్ని ముఖాలను చూశారో మాకు చెప్పండి? మీరు 5 , 10, 15 ముఖాలా అనేవి గుర్తించండి. వాస్తవంగా ఈ ఫోటోలో ఎన్ని ముఖాలు దాగున్నాయో గుర్తించడం నిజమైన సరదా.. అవును నిజంగా ఆ ఫోటోలో దాగున్న ముఖాలను కనుగొనడం ఒక ఫన్నీ ఫీలింగ్..


## ఈ కూరగాయను తక్కువ అంచనా వేయకండి.. ఎన్నో రోగాలకు మందు ఇది..!





అందరూ ఎక్కువగా ఇష్టపడే కూరగాయల లిస్ట్ లో వంకాయ ఉండకపోవచ్చు. కానీ దీనిలో ఉన్న పోషకాల విలువ మాత్రం చాలా ఎక్కువ. ఇది ఎన్నో వ్యాధులతో పోరాడే శక్తిని సహజంగా ఇవ్వగలదు. దీని రుచి నచ్చక తినని వాళ్లైనా.. దీని ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే ప్రతిరోజూ తినే అలవాటు చేసుకుంటారు. రోజువారీ ఆహారంలో మనం ఎన్నో కూరగాయలు వాడుతాం. కానీ కొన్ని సార్లు వంకాయను తినం.. ఎందుకంటే దాని రుచి నచ్చదని అంటాం. కానీ మనం దీన్ని పూర్తిగా తినకపోవడం ఆరోగ్యానికి ఉపయోగపడే గొప్ప ఔషధాన్ని దూరం చేసుకున్నట్లే అవుతుంది. వంకాయలో ఫైటోన్యూట్రియంట్స్ అనే రసాయనాలు మెదడు పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇవి మెదడులోని నర కణాల మధ్య సంబంధాన్ని బలోపేతం చేస్తాయి. దాని వల్ల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. మతిమరుపు తగ్గుతుంది. ఇందులో ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉండటం వల్ల రోజూ తింటే ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. వయస్సు పెరిగే కొద్దీ ఎముకల బలం తగ్గకుండా ఉండాలంటే వంకాయ మంచి సహాయం చేస్తుంది. వంకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, మాంగనీస్ శరీరంలోని కణాలను రక్షించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి కాపాడి.. క్యాన్సర్ కణాలు పెరగకుండా నియంత్రిస్తాయి. వంకాయలో ఐరన్ ఉండటం వల్ల రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయిని పెంచే అవకాశం ఉంటుంది. దీన్ని తరచుగా ఆహారంలో చేర్చడం ద్వారా రక్తహీనత (ఎనిమియా) సమస్యలను తగ్గించవచ్చు. నీరసంగా, అలసటతో ఉన్నవారికి ఇది చాలా ప్రయోజనకరం. డయాబెటిస్ ఉన్నవారు కూడా వంకాయ తినవచ్చు. ఇందులో ఉండే పాలిఫినాల్స్ రక్తంలో గ్లూకోజ్ శాతం తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఇది తోడ్పడుతుంది. వంకాయలో ఎక్కువగా ఉండే ఫైబర్ వల్ల కడుపు నిండిన భావన కలిగిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. ఫలితంగా శరీర బరువు అదుపులో ఉంటుంది. ఆయుర్వేద నిపుణుల మాటల ప్రకారం.. వంకాయ నిద్రలేమి లాంటి సమస్యలకు సహజ చికిత్సగా ఉపయోగపడుతుంది. ఇది శరీరంలోని అధిక వేడిని తగ్గించి, తల నొప్పి, మలబద్ధకం, గొంతులో గరగర, వాంతులు, శరీరంలో వాపులు, వాత రోగాలకు ఉపశమనం ఇస్తుంది. మొదటి దశలో ఉన్న కిడ్నీ రాళ్లను కరిగించే గుణం కూడా దీనిలో ఉంది. ఈ కూరగాయను మీరు ఇష్టపడకపోయినా.. దీని ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం విస్మరించలేనివి. రోజూ వంకాయను తక్కువ మోతాదులో ఆహారంలో చేర్చడం ద్వారా మన ఆరోగ్యాన్ని చాలా మెరుగుపరుచుకోవచ్చు.

# కిడ్నీలు ప్రమాదంలో ఉంటే కంటిలో కనిపించే సీక్రెట్ లక్షణాలు ఇవే!











మానవ శరీరంలో కిడ్నీలు కీలక పాత్ర పోషిస్తాయి. శరీరంలోని విషాన్ని బయటకు పంపిచడంలో ప్రధాన పాత్ర వహిస్తాయి. అందుకే కిడ్నీల ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తారు ఆరోగ్య నిపుణులు. అయితే ఇప్పుడున్న జీవన శైలీ, తీసుకుంటున్న ఆహారం కారణంగా చాలా మంది కిడ్నీ ఫెయిల్యూర్ వంటి చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారు. అయితే కిడ్నీలు ప్రమాదంలో ఉంటే కళ్లలో పలు లక్షణాలు కనిపిస్తాయంట. అవి ఏవో ఇప్పుడు చూద్దాం.

**ఉబ్బిన కళ్లు :** కళ్లు ఉబ్బడం అనేది కొన్నిసార్లు సహజం. అయితే కంటి నిండా నిద్రపోయినా, కళ్లు ఉబ్బినట్లు అనిపిస్తే.. రోజుల తరబడి ఇలానే జరిగితే కాస్త జాగ్రత్తపడాలి అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే. కొన్ని సార్లు మూత్రపిండాలు దెబ్బతింటే కూడా కళ్లు ఉబ్బినట్లు కనిపిస్తాయంట. దీనిని ప్రోటీన్యూరియా అంటారంట. అందుకే ఈ విషయంలో కాస్త జాగ్రత్త అవసరం.

**అస్పష్టమైన కంటి చూపు :** మూత్రపిండాలు ప్రమాదంలో ఉంటే కంటి చూపు అస్పష్టంగా కనిపిస్తుందంట. ఎందుకంటే? అధిక రక్తపోటు, మధుమేహం సమస్యలు ఉన్నవారిలో అవి వారి కంటిలోని రక్తనాళాలను కూడా ప్రభావితం చేయడం వలన దృష్టిలో మార్పు వస్తుంది. ఇది మూత్రపిండాలపై కూడా ప్రభావం చూపిస్తుందంట.


**కళ్లు పొడిబారడం :** కళ్లు పొడిబారడం కొన్ని సమయంలో సహజం. కానీ తరచుగా కళ్లు పొడిబారడం, కంటిలో దురద వంటి సమస్యలు తలెత్తే జాగ్రత్తపడాలని చెప్తున్నారు వైద్యనిపుణులు. ఎందుకంటే మూత్రపిండాల సమస్యతో బాధపడే వారిలో కూడా ఈ సమస్య ఉంటుందంట.

**కళ్లు ఎక్కువగా ఎరుపు రంగులోకి మారడం :** కళ్లకు ఏదైనా గాయం అయినప్పుడు లేదా, దుమ్ము ధూళి పడినప్పుడు మాత్రమే కళ్లు ఎరుపు రంగులోకి మారుతాయి. కానీ మీ కళ్లు ఎప్పుడూ ఎరుపు రంగులో ఉంటే మాత్రం తప్పకుండా ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలంట. కళ్లు ఎరుపు రంగులోకి మారడం మూత్రపిండాల వ్యాధికి ప్రధాన కారణం అంటున్నారు నిపుణులు. కిడ్నీ సమస్య ఉన్నవారు రంగులను చూడటంలో కొన్ని సమస్యలు తలెత్తుతాయంటున్నారు ఆరోగ్య నిపుణులు.మూత్రపిండాల సమస్యలు ఉన్న కొంతమందికి కొన్ని రంగులను, ముఖ్యంగా నీలం , పసుపు రంగులను వేరు చేయడం కష్టంగా అనిపించవచ్చు. ఇది ఆప్టిక్ నరాల దెబ్బతినడం లేదా దీర్ఘకాలిక అనారోగ్యం కారణంగా రెటీనాలో మార్పుల వల్ల వస్తుందంట. కిడ్నీ సమస్య ఉన్నవారు రంగులను చూడటంలో కొన్ని సమస్యలు తలెత్తుతాయంటున్నారు ఆరోగ్య నిపుణులు.మూత్రపిండాల సమస్యలు ఉన్న కొంతమందికి కొన్ని రంగులను, ముఖ్యంగా నీలం , పసుపు రంగులను వేరు చేయడం కష్టంగా అనిపించవచ్చు. ఇది ఆప్టిక్ నరాల దెబ్బతినడం లేదా దీర్ఘకాలిక అనారోగ్యం కారణంగా రెటీనాలో మార్పుల వల్ల వస్తుందంట.

# రోజూ గుడ్డు తినొచ్చా - అందులోని కొలెస్ట్రాల్ మంచిదేనా

### రోజూ గుడ్డు తినడం వల్ల కొలెస్ట్రాల్ పెరుగుతుందనే భయాలు

### పరిశోధనలు ఏం చెప్తున్నాయో తెలుసా?



'సండే అయినా, మండే అయినా రోజూ తినండి గుడ్డు' అని అడ్వర్టైజ్మెంట్‌లో వింటూ ఉంటాం. కానీ, ప్రస్తుతం గుడ్డులోని పచ్చసొనలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటుందని కొంతమంది తినడం మానేస్తున్నారు. ఇంకొందరు గుడ్డులోని తెల్లసొన తిని, పచ్చసొనను పక్కన పెడుతుంటారు. వాస్తవానికి, వీటి రెండింటిలోనూ పోషకాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో గుడ్డులోని పచ్చసోన తినడం ఆరోగ్యానికి మంచిదా? కదా? లాంటి విషయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!ప్రపంచవ్యాప్తంగా గుడ్లు అత్యంత సంపూర్ణమైన, చౌకైన ఆహార వనరులు. తెల్లసొనలో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుందని మన అందరికీ తెలుసు. కానీ, గుడ్డులోని ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు పచ్చసొనలోనే ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. దీనిని తీసివేస్తే, గుడ్డులోని పోషక విలువలు గణనీయంగా తగ్గిపోతాయంటున్నారు. ఈ క్రమంలో గుడ్డును 'సూపర్ ఫుడ్'గా మార్చే పోషకాలన్నీ పచ్చసొనలోనే ఉన్నాయని పేర్కొంటున్నారు.

**విటమిన్లు, ఖనిజాలు :** గుడ్డు పచ్చసొనలో విటమిన్ ఎ, డి, ఈ, కె వంటి కొవ్వులో కరిగే విటమిన్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తి, ఎముకల ఆరోగ్యానికి, శరీరానికి రక్షణనిచ్చే యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేస్తాయంటున్నారు నిపుణులు. వీటితో పాటు విటమిన్ బి12, ఫోలిక్ యాసిడ్, ఐరన్ పుష్కలంగా ఉంటుందని, ఇవి ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి, మెదడు ఆరోగ్యానికి తోడ్పడతాయని పేర్కొంటున్నారు.

**గుండె ఆరోగ్యానికి :** గుడ్డును రోజూ తినడం వల్ల గుండె జబ్బుల బారిన పడే అవకాశం ఉందని చాలా మంది అనుకుంటారు. కానీ, రోజూ ఒకటి లేదా రెండు గుడ్లు తినడం వల్ల గుండె జబ్బుల ముప్పు పెరగదని, పరిమితంగా తిన్నప్పుడు ఇవి శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషకాలను అందిస్తాయంటున్నారు నిపుణులు. గుండెజబ్బులతో బాధపడుతున్న వారు రోజుకు 200ఎస్త్ర కంటే తక్కువగా కొలెస్ట్రాల్ తీసుకోవడం మంచిది.


**మెదడు పనితీరుకు మేలు :** పచ్చసొనలో 'కోలిన్' అనే కీలక పోషకం ఉంటుందట. ఇది మెదడు పనితీరుకు, నరాల ఆరోగ్యానికి, జ్ఞాపకశక్తికి చాలా అవసరమంటున్నారు నిపుణులు. ముఖ్యంగా గర్భిణులకు ఇది మరీ అవసరమట. ఎందుకంటే, ఇది పిండం మెదడు అభివృద్ధికి సహాయపడుతుందని చెబుతున్నారు. మనం తినే ఆహారం వల్ల కొలెస్ట్రాల్ రాదని పేర్కొంది. ఈ క్రమంలో కళ్లకు మేలు చేసే ల్యూటిన్, జీక్సాంథిన్; మెదడు, నరాలకు మేలు చేసే కోలిన్; వివిధ విటమిన్లు లాంటి ఆరోగ్యకరమైన పోషకాలు కూడా ఉన్నాయని తెలిపింది.కంటి ఆరోగ్యానికి రక్షణ : పచ్చసొనలో ల్యూటిన్, జియాక్సంతిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కళ్లను హానికరమైన బ్లూ లైట్ నుంచి కాపాడటమే కాకుండా, వయస్సుతో పాటు వచ్చే చూపు మందగించడం, శుక్లాల సమస్యలను నివారిస్తాయంటున్నారు నిపుణులు.

**పోషకాల శోషణ :** పచ్చసొనలోని కొవ్వులు శరీరానికి అవసరమైన విటమిన్లను గ్రహించడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగించి, అనవసరమైన స్నాక్స్ తినకుండా చేస్తుందని అంటున్నారు. ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా వీటిని తీసుకోవడం వల్ల ఎటువంటి నష్టం ఉండదని సూచిస్తున్నారు.


**కండరాల పెరుగుదల :** కేవలం తెల్లసొన కంటే, గుడ్డు మొత్తాన్ని తిన్నప్పుడే శరీరానికి ప్రోటీన్ సమర్థవంతంగా అందుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో కండరాల మరమ్మత్తు, పెరుగుదల కోసం అథ్లెట్లకు ఇది ఎంతో మేలు చేస్తుందని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో పచ్చసొనను వదిలేసి, కేవలం తెల్లసొనను తినడం వల్ల శరీరానికి అందాల్సిన ముఖ్యమైన విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, మెదడుకు మేలు చేసే పోషకాలను కోల్పోయినట్లేనని నిపుణులు తెలియజేస్తున్నారు. అయితే, డాక్టర్లు వద్దని చెబితే తప్ప, ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా గుడ్డును పూర్తిగా తినడం మంచిదని సూచిస్తున్నారు.

## ప్రపంచంలో రాత్రి లేని దేశం ఒకటి ఉందని మీకు తెలుసా?

# ఆ దేశ అందాలు చూడానికి రెండు కళ్ళు చాలవు సుమా..



పగలు రాత్రి కలిస్తే రోజు. ప్రపంచంలోని ప్రతి దేశంలో సూర్యోదయం, సూర్యాస్తమం జరుగుతోంది. ప్రజలు రోజులో పగలు తమ పనులు విధులను నిర్వహించి.. రాత్రి సమయంలో విశ్రాంతి తీసుకుంటారు. అయితే ప్రపంచంలో రాత్రి లేని ఒకటి ఉందని మీకు తెలుసా.. ఆ దేశంలో సూర్యుడు కేవలం 40 నిమిషాలు మాత్రమే అస్తమిస్తాడు. మిగిలిన సమయంలో వెలుతురు ఉంటుంది. ఈ దేశం గురించి మరికొన్ని ఆసక్తికరమైన విషయాలు ఏమిటంటే.. పగలు రాత్రి కలిస్తే రోజు. ప్రపంచంలోని ప్రతి దేశంలో సూర్యోదయం, సూర్యాస్తమం జరుగుతోంది. ప్రజలు రోజులో పగలు తమ పనులు విధులను నిర్వహించి.. రాత్రి సమయంలో విశ్రాంతి తీసుకుంటారు. అయితే ప్రపంచంలో రాత్రి లేని ఒకటి ఉందని మీకు తెలుసా.. ఆ దేశంలో సూర్యుడు కేవలం 40 నిమిషాలు మాత్రమే అస్తమిస్తాడు. మిగిలిన సమయంలో వెలుతురు ఉంటుంది. ఈ దేశం గురించి మరికొన్ని ఆసక్తికరమైన విషయాలు ఏమిటంటే.. ప్రపంచంలో చాలా ప్రదేశాలు రహస్యాలతో నిండి ఉన్నాయి. వాటి గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. ప్రపంచంలో వాటి ప్రత్యేకతలకు ప్రసిద్ధి చెందిన అనేక దేశాలు కూడా ఉన్నాయి. వాటిని చూడటానికి , వాటి గురించి తెలుసుకోవడానికి ప్రజలు దూర ప్రాంతాల నుంచి వస్తారు. రాత్రి లేని దేశం ఉందని మీకు తెలుసా. ప్రజలు సౌకర్యవంతమైన జీవితాన్ని గడిపే ఇతర దేశాలలో ఒకటి నార్వే. ఈ దేశంలో రాత్రి ఉండదు. ఇక్కడ సూర్యుడు 40 నిమిషాలు మాత్రమే అస్తమిస్తాడు. మిగిలిన సమయంలో వెలుతురు ఉంటుంది. ఈ ప్రదేశం గురించి మరికొన్ని ఆసక్తికరమైన విషయాలను ఈ రోజు తెలుసుకుందాం. 40 నిమిషాలు మాత్రమే అస్తమించే సూర్యుడు నార్వే యూరోపియన్ ఖండానికి ఉత్తరాన ఉంది. ఇది ఉత్తర ధ్రువానికి చాలా దగ్గరగా ఉంది. ఈ కారణంగా ఇక్కడ చాలా చల్లగా ఉంటుంది. ఈ దేశంలో సూర్యుడు 76 రోజులు అస్తమించడు. దాదాపు రెండున్నర నెలలు, ఇక్కడ రాత్రి 40 నిమిషాలు మాత్రమే ఉంటుంది. ఇక్కడ సూర్యుడు అర్ధరాత్రి 12:40 నుంచి 1:30 గంటల మధ్య దాదాపు 40 నిమిషాలు అస్తమిస్తాడు. అందుకే నార్వేని అర్ధరాత్రి సూర్యుని భూమి అని పిలుస్తారు అని పిలుస్తారు. ప్రజలు పండుగ జరుపుకుంటారు నార్వే ప్రజలు మిడ్‌నైట్ సన్‌ను పండుగగా జరుపుకుంటారు. అర్ధరాత్రి బీచ్‌ను సందర్శించడానికి దూర ప్రాంతాల నుంచి ప్రజలు ఇక్కడికి వస్తారు. ఇది మాత్రమే కాదు.. ఇక్కడి ప్రజలు అర్ధరాత్రి సూర్యుడిని చూడటానికి ట్రెక్కింగ్‌కు కూడా వెళతారు. ఈ సమయం ఆ దేశ ప్రజలకు చాలా ప్రత్యేకమైనది. అందమైన దృశ్యాలు నార్వే దేశంలో అందాలకు కొదవ లేదు. ఇక్కడి అందం ఎంతగా ఉంటుందంటే.. అర్ధరాత్రి బోటింగ్, ట్రెక్కింగ్ చేస్తూ ప్రజలు ఇక్కడ తిరుగుతారు. చాలా దూరం నుంచి వచ్చే పర్యాటకులు ప్రతి సంవత్సరం ప్రజలు నార్వేజియన్ నగరమైన ట్రోమ్సోకు ఉత్తర దీపాలను చూడటానికి వస్తారు. దీనిని అరోరా బోరియాలిస్ అని కూడా పిలుస్తారు. ఈ దీపాలను చూడటానికి ఉత్తమ సమయం నవంబర్ నుంచి ఫిబ్రవరి మధ్య ఉంటుంది. ఎందుకంటే ఈ సమయంలో రాత్రులు చాలా ఎక్కువగా ఉంటాయి. ఈ సమయంలో సూర్యుడు అస్తమించడు. ఇక్కడ దాదాపు 24 గంటలూ సూర్యరశ్మిని ఆస్వాదించవచ్చు.



# భారత్, అమెరికా వాణిజ్య ఒప్పంద చర్చలు

**వచ్చే వారం అగ్రరాజ్యానికి ఇండియన్ అధికారులు**

**వచ్చే వారం అమెరికా వెళ్లనున్న భారత అధికారుల బృందం**

**వాణిజ్య ఒప్పందంపై చర్చలు**

**తొలిదశ వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ముసాయిదా ఫిబ్రవరిలో ఖరారు**



అమెరికాతో కీలక వాణిజ్య చర్చల కోసం భారత అధికారుల బృందం ఏప్రిల్ 20 నుంచి వాషింగ్టన్‌ను సందర్శించనున్నట్లు అదనపు కార్యదర్శి దర్పణ్ జైన్ పేర్కొన్నారు. భారత్, అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ముసాయిదా ఇప్పటికే ఖరారైన నేపథ్యంలో ఈ ద్వైపాక్షిక భేటీ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. వాస్తవానికి ఈ ఒప్పందంపై ఈ ఏడాది మార్చిలోనే సంతకాలు జరగాల్సి ఉంది. అయితే, అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన ఒక తీర్పుతో అక్కడి టారిఫ్ విధానాల్లో అనూహ్య మార్పులు జరిగాయి. అమెరికా నూతన గ్లోబల్ టారిఫ్ విధానం పూర్తిగా అమల్లోకి వచ్చిన తర్వాతే ఈ ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని అధికారిక వర్గాలు గతంలోనే స్పష్టం చేశాయి.భారత్, అమెరికా మధ్య తొలిదశ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ముసాయిదా ఫిబ్రవరిలో ఖరారైంది. ఈ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం, భారత్‌పై సుంకాలను 18 శాతానికి తగ్గించేందుకు అమెరికా అంగీకరించింది. అయితే ట్రంప్ తీసుకొచ్చిన పరస్పర సుంకాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఆ దేశ టారిఫ్ విధానం మారిపోయింది. ఈ పరిణామాల తర్వాత, ఫిబ్రవరి 24 నుంచి 150 రోజుల పాటు అన్ని వాణిజ్య భాగస్వామ్య దేశాలపై 10 శాతం సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు, అమెరికా సెక్షన్ 301 కింద రెండు వేర్వేరు దర్యాప్తులు చేపడుతున్న తరుణంలో వచ్చే వారం వాషింగ్టన్‌లో జరగనున్న భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.ఇదిలా ఉండగా, ఫిబ్రవరిలో భారత్-అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారైంది. అందుకు సంబంధించి ఇరుదేశాలు ఓ సంయుక్త ప్రకటనను కూడా విడుదల చేశాయి. అయితే, ఆ ఒప్పందంలో భారత ఉత్పత్తులపై ఉన్న 50 శాతం సుంకాన్ని 18 శాతానికి తగ్గిస్తున్నట్లు అగ్రరాజ్యం ప్రకటించింది. ఇరుదేశాలకు ప్రయోజనకరమైన ద్వైపాక్షిక వాణిజ్యఒప్పందం కోసం ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటుచేసినట్లు ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నాయి. అయితే, ఈ చర్చల్లో కీలక పాత్ర పోషించిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ మధ్యంతర ఒప్పందాన్ని చరిత్రాత్మక విజయంగా అభివర్ణించారు. ఆ ఒప్పందం భారతీయ ఎగుమతిదారులకు 30 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ తెరుస్తుందని, ముఖ్యంగా ఎంఎస్ఎంఈలు, రైతులు, మత్స్యకారులకు ప్రయోజనం చేకూరుస్తుందని చెప్పారు.ఎగుమతులు పెరగడంతో దేశవ్యాప్తంగా మహిళలు, యువతకు లక్షలాది కొత్త ఉద్యోగావకాశాలు వస్తాయని మంత్రి గోయల్ ధీమా వ్యక్తం చేశారు. దుస్తులు, తోలు, పాదరక్షలు, ప్లాస్టిక్, రబ్బరు ఉత్పత్తులు, సేంద్రియ రసాయనాలు, గృహాలంకరణ, చేతివృత్తుల ఉత్పత్తులు, ఎంపిక చేసిన యంత్రాలు వంటి కీలక రంగాలకు లాభాలు చేకూరతాయన్నారు. అలాగే, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేసేందుకు భారత్ అంగీకరించిందని అమెరికా అప్పట్లో పేర్కొంది. తమ దేశం నుంచి భారీగా ఇంధనం, గ్యాస్‌ను దిగుమతి చేసుకునేందుకు అంగీకరించినట్లు తెలిపింది. తమ దేశం నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులకు భారత్ అంగీకరించిందని వెల్లడించింది.మరోవైపు, భారత్ -అమెరికా మధ్య ఖరారైన మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో భాగంగా మొక్కజొన్న, గోధుమ, బియ్యం, సోయా, సుగంధ ద్రవ్యాలు, ధాన్యాలు, నూనెగింజలు, పౌల్ట్రీ, పాలు, జున్ను, ఇథనాల్, పొగాకుతో పాటు కొన్నిరకాల కూరగాయలు, మాంసం వంటి వ్యవసాయ, పాల ఉత్పత్తులపై సుంకాల విషయంలో అమెరికాకు ఎలాంటి రాయితీలు ఇవ్వలేదని మంత్రి గోయల్ స్పష్టం చేశారు. అన్ని వాణిజ్య చర్చల్లో రైతుల ప్రయోజనాలకే తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని ఆయన తెలిపారు.

# ఇరాన్ యుద్ధంపై ట్రంప్ సంచలన ప్రకటన

**నేనే లేకుంటే టెహ్రాన్ చేతిలో ప్రపంచం ముక్కలయ్యేదని వెల్లడి..**



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో అంతర్జాతీయ రాజకీయాలను మరోసారి వేడెక్కించారు. ఫాక్స్ న్యూస్ ఛానల్‌లో మారియా బార్టిరోమో నిర్వహించే 'మార్నింగ్స్ విత్ మారియా' షోలో పాల్గొన్న ఆయన.. ఇరాన్‌తో నెలకొన్న యుద్ధ వాతావరణం దాదాపుగా ముగింపు దశకు చేరుకుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సంక్షోభంపై యాంకర్ పదేపదే ప్రశ్నించినప్పటికీ, ట్రంప్ చాలా ఆత్మవిశ్వాసంతో సమాధానమిస్తూ, బహుశా ఈ పోరాటం ముగిసిందనే తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు.ఒకవేళ తాను ఈ యుద్ధాన్ని ముందే ప్రారంభించి ఉండకపోతే.. ఇరాన్ ఇప్పటికే అణ్వాయుధాలను సమకూర్చుకుని ఉండేదని, అప్పుడు ప్రపంచమంతా వారి ముందు తలవంచాల్సి వచ్చేదని ఆయన విశ్లేషించారు. ఇప్పుడు తాము తప్పుకున్నా కూడా ఇరాన్ మళ్లీ తన పునాదులను నిర్మించుకోవడానికి కనీసం రెండు దశాబ్దాల సమయం పడుతుందని, అయితే తమ పని ఇంకా పూర్తి కాలేదని ఆయన సంకేతాలిచ్చారు.ప్రస్తుతం ఇరాన్ ప్రభుత్వం అమెరికాతో ఒక ఒప్పందాన్ని (డీల్) కుదుర్చుకోవడానికి తీవ్ర ఆసక్తిని ప్రదర్శిస్తోందని ట్రంప్ వెల్లడించారు. ఇరాన్‌లో రాడికల్ శక్తులను పూర్తిగా ఏరివేశామని, అధికార మార్పిడి కూడా జరిగిందని, కాబట్టి ఇకపై ఎలాంటి సమస్యలు ఉండబోవని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఏబీసీ న్యూస్ ప్రతినిధి జోనాథన్ కార్ల్‌తో మాట్లాడుతూ.. ప్రస్తుతం అమల్లో ఉన్న సీజ్‌ఫైర్‌ను (యుద్ధ విరామాన్ని) పొడిగించాల్సిన అవసరం లేదని, ఎందుకంటే త్వరలోనే ఒక శాశ్వత పరిష్కారం లేదా ఒప్పందం కుదురుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ తాను గనుక దేశాధ్యక్షుడిగా లేకపోయి ఉంటే.. ఈ పాటికే ప్రపంచం ముక్కలయ్యేదని ట్రంప్ తనదైన శైలిలో వ్యాఖ్యానించారు.మళ్లీ టారిఫ్ బాదుడు మొదలు పెట్టిన ట్రంప్.. ఇరాన్‌తో పాటు చైనా అంతు కూడా చూస్తామని సంచలన ప్రకటన.. మళ్లీ టారిఫ్ బాదుడు మొదలు పెట్టిన ట్రంప్.. ఇరాన్‌తో పాటు చైనా అంతు కూడా చూస్తామని సంచలన ప్రకటన..మరోవైపు క్షేత్రస్థాయిలో అమెరికా సైన్యం తన పట్టును మరింత బిగిస్తోంది. ఇరాన్ తీర ప్రాంతంలోని పోర్టులను అమెరికా సెంట్రల్ కమాండ్ సంపూర్ణంగా దిగ్బంధించినట్లు ప్రకటించింది. హార్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలను పూర్తిగా అడ్డుకోవడం ద్వారా, ఆ ప్రాంతంలో తమ సైనిక, నౌకాదళ ఆధిపత్యాన్ని చాటుకున్నట్లు సెంట్ కామ్ అధినేత బ్రాడ్ కూపర్ వెల్లడించారు. కేవలం 36 గంటల వ్యవధిలోనే ఇరాన్ రేవుల నుండి వెళ్లే, లోపలికి వచ్చే వాణిజ్యాన్ని అమెరికా మిలిటరీ స్తంభింపజేసింది. ఈ ఆపరేషన్ కోసం అమెరికాకు చెందిన అత్యాధునిక నేవీ గైడెడ్ మిస్సైల్ డెస్ట్రాయర్లను రంగంలోకి దించారు. ఒక్కో డెస్ట్రాయర్ నౌకలో సుమారు 300 మంది సుశిక్షితులైన నావికులు ఉండి, ఏ క్షణమైనా శత్రువుపై విరుచుకుపడే సామర్థ్యాన్ని కలిగి ఉన్నారు.అయితే, ఈ విషయంలో అమెరికాకు తన చిరకాల మిత్రదేశాల నుండి ఊహించని ప్రతిఘటన ఎదురవుతోంది. ఇరాన్ పోర్టులను బ్లాక్ చేయాలన్న ట్రంప్ పిలుపును బ్రిటన్, ఫ్రాన్స్ వంటి నాటో దేశాలు తిరస్కరించాయి. ఈ ఘర్షణలో భాగస్వాములు కావడం తమకు ఇష్టం లేదని, బలవంతంగా తమను యుద్ధంలోకి ఈడ్చవద్దని ఆ దేశాలు స్పష్టం చేశాయి.ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు ఐదో వంతు హార్ముజ్ జలసంధి గుండానే జరుగుతుంది కాబట్టి, ఆ మార్గాన్ని తెరిపించడానికి మాత్రమే తాము సహకరిస్తామని, అంతకుమించి ఇరాన్‌పై సైనిక చర్యలకు తాము సిద్ధంగా లేమని అవి తేల్చిచెప్పాయి. ఈ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, మిత్రదేశాలు సహకరించకపోతే తాము నాటో కూటమి నుండి వైదొలుగుతామని బెదిరించడం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర చర్చకు దారితీసింది. రాబోయే రెండు రోజుల్లో ట్రంప్ తీసుకోబోయే నిర్ణయాలు ఇరాన్ భవిష్యత్తును, ప్రపంచ భద్రతను నిర్దేశించనున్నాయి.

# రూ. 12 వేల కోట్ల సామ్రాజ్యం

**ఒక్క తప్పుతో రాత్రికి రాత్రే కుప్పకూలి**

**74 రూపాయలకు అమ్మకం..**



బిలియన్ డాలర్ల సామ్రాజ్యాన్ని నిర్మించడం ఒక ఎత్తు అయితే, దానిని నైతిక విలువలతో నిలబెట్టుకోవడం మరొక ఎత్తు. పద్మశ్రీ పురస్కార గ్రహీత బి.ఆర్.శెట్టి జీవిత ప్రయాణం కూడా అలాంటిదే. సున్నా నుండి మొదలై వేల కోట్ల సామ్రాజ్యాన్ని నిర్మించి, మళ్ళీ అనిశ్చితిలోకి పడిపోయిన ఆయన కథ కార్పొరేట్ ప్రపంచంలో ఒక హెచ్చరికగా నిలుస్తుంది.దాదాపు 12 వేల కోట్ల రూపాయల విలువైన సామ్రాజ్యం కేవలం కొద్ది నెలల్లోనే కుప్పకూలడం, చివరకు దానిలో కొన్ని భాగాలను కేవలం 74 రూపాయలకే విక్రయించాల్సి రావడం ఊహకందని విషయం. పద్మశ్రీ పురస్కార గ్రహీతగా, ఒక విజయవంతమైన వ్యాపారవేత్తగా వెలిగిన , నేడు న్యాయపోరాటాలు, ఆస్తుల స్తంభన వంటి తీవ్ర సమస్యలతో సతమతమవుతున్నారు.ఈ అసాధారణ ప్రయాణం 1942లో ఉడుపిలో ప్రారంభమైంది. 1942 ఆగస్టు 1న ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన శెట్టి.. మణిపాల్ విశ్వవిద్యాలయం నుండి ఫార్మసీ పట్టా పొందిన తర్వాత ఆర్థిక అవసరాల రీత్యా 1973లో అరబ్ దేశాలకు పయనమయ్యారు. ఆ సమయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అప్పుడిప్పుడే అభివృద్ధి పథంలో పయనిస్తోంది.అక్కడ అడుగుపెట్టిన ఆయన, దేశంలోనే మొట్టమొదటి మెడికల్ రిప్రజెంటేటివ్‌గా తన వృత్తిని ప్రారంభించి.. మారుమూల ప్రాంతాలకు కూడా మందులను చేరవేసేవారు. 1975లో తన భార్య డాక్టర్ చంద్రకుమారి శెట్టి సహాయంతో "న్యూ మెడికల్ సెంటర్" అనే చిన్న క్లినిక్‌ను ప్రారంభించినప్పుడు, అది ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ సంస్థగా ఎదుగుతుందని ఎవరూ ఊహించలేదు.క్రమంగా శెట్టి తన వ్యాపార పరిధిని పెంచుకుంటూ పోయారు. కేవలం వైద్య రంగంలోనే కాకుండా, ప్రవాస భారతీయుల కోసం 'యూఏఈ ఎక్స్ఛేంజ్' ద్వారా ఆర్థిక సేవలను, 'నియోఫార్మా' ద్వారా ఔషధ తయారీని ప్రారంభించి ఒక బహుముఖ సామ్రాజ్యాన్ని సృష్టించారు. 2012లో లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన తొలి యూఏఈ ఆరోగ్య సంస్థగా నిలిచినప్పుడు శెట్టి కీర్తి శిఖరాగ్రానికి చేరింది. సుమారు 4 బిలియన్ డాలర్ల వ్యక్తిగత సంపదతో, బుర్జ్ ఖలీఫాలో విలాసవంతమైన ఆస్తులతో ఆయన ప్రపంచంలోని అత్యంత ధనవంతులలో ఒకరిగా నిలిచారు. అయితే, ఈ వెలుగుల వెనుక అప్పుల చీకటి నిశ్శబ్దంగా పేరుకుపోతోందని ఎవరూ గమనించలేదు.2019 డిసెంబర్‌లో 'మడ్డీ వాటర్స్ రీసెర్చ్' వెలువరించిన ఒక నివేదిక ఈ సామ్రాజ్యం పునాదులను కదిలించింది. ఎన్ఎంసీ హెల్త్ తన ఖాతా పుస్తకాలలో నగదు నిల్వలను తప్పుగా చూపించిందని, పెట్టుబడిదారులకు తెలియకుండా భారీగా అప్పులు చేసిందని ఆ నివేదిక సంచలన ఆరోపణలు చేసింది. దర్యాప్తులో దాదాపు 4 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 33 వేల కోట్లు) అప్పును సంస్థ దాచిపెట్టినట్లు వెల్లడైంది. మోసపూరిత పత్రాలు, అనధికార రుణాలు బయటపడటంతో కంపెనీ షేర్లు కుప్పకూలాయి. 2020లో శెట్టి తన పదవులకు రాజీనామా చేసినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.ఆ తర్వాత పరిస్థితులు మరింత విషమించాయి. యూకే హైకోర్టు ఎన్ఎంసీని తన ఆధీనంలోకి తీసుకోగా.. అబుదాబి కమర్షియల్ బ్యాంక్ వంటి అనేక బ్యాంకులు వేల కోట్ల నష్టాలను చవిచూశాయి. ఆయన నిర్మించిన ఫినాబ్లర్ వంటి హోల్డింగ్ కంపెనీని అత్యంత తక్కువ ధరకు (కేవలం ఒక డాలర్ వంటి నామమాత్రపు విలువకు) విక్రయించాల్సి వచ్చింది. శెట్టి వ్యక్తిగత ఆస్తులు స్తంభించిపోయాయి.ఆయనపై అంతర్జాతీయ స్థాయిలో దర్యాప్తులు మొదలయ్యాయి. ఇటీవల 2025 అక్టోబర్‌లో దుబాయ్ కోర్టు ఇచ్చిన తీర్పు దీనికి పరాకాష్టగా నిలిచింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు సుమారు 46 మిలియన్ డాలర్లు తిరిగి చెల్లించాలని కోర్టు ఆయనను ఆదేశించింది. ప్రస్తుతం 2026 నాటికి కూడా శెట్టి న్యాయపోరాటాల్లోనే చిక్కుకుని ఉన్నారు. నిన్నటి వరకు వేల కోట్లకు అధిపతిగా ఉన్న వ్యక్తి, నేడు తన ఉనికిని కాపాడుకోవడానికి న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సి రావడం విధి వైచిత్రి.నేడు ఎన్ఎంసి హెల్త్ పనిచేస్తున్నప్పటికీ, దాని సృష్టికర్త మాత్రం తన స్వంత సామ్రాజ్యం నుండి దూరమై న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా కష్టపడి నిర్మించిన ఒక సామ్రాజ్యం వ్యాపారంలో పారదర్శకత, పాలన లోపిస్తే పేకమేడలా కూలిపోతుందని బి.ఆర్. శెట్టి కథ మనకు గుర్తుచేస్తుంది. ఇది కేవలం ఒక వ్యక్తి పతనం కాదు, ఒక వ్యవస్థలోని నైతిక వైఫల్యానికి సాక్ష్యం.

## ఈ చిన్న దేశం కొంటున్న బంగారం చూస్తే కళ్లు చెదరాల్సిందే!



ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా పెను మార్పులకు కారణమవుతున్నాయి. యుద్ధ భయం వల్ల పెట్టుబడిదారులు, దేశాల కేంద్ర బ్యాంకులు సురక్షితమైన ఆస్తిగా భావించే బంగారం వైపు మొగ్గు చూపుతున్నాయి. ఈ క్రమంలో కొన్ని దేశాలు తమ బంగారం నిల్వలు పెంచుకోవడంలో భారత్ , చైనా వంటి దిగ్గజాలను కూడా వెనక్కి నెట్టడం ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.పోలాండ్ అద్భుతమైన కొనుగోళ్లుఫిబ్రవరి 2026 నాటి గణాంకాల ప్రకారం, ప్రపంచంలోనే అత్యధికంగా బంగారాన్ని కొనుగోలు చేసిన దేశంగా పోలాండ్ నిలిచింది. కేవలం ఒక్క నెలలోనే ఈ దేశం ఏకంగా 20 టన్నుల బంగారాన్ని తన ఖాతాలో వేసుకుంది. దీంతో పోలాండ్ మొత్తం సువర్ణ నిల్వలు 570 టన్నులకు చేరుకున్నాయి. గత ఏడాది కాలంలో పోలాండ్ మొత్తం 102 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసి, ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించింది.ఉజ్బెకిస్థాన్ కూడా రేసులో..పోలాండ్ తర్వాత ఉజ్బెకిస్థాన్ కూడా తన బంగారు నిల్వలను భారీగా పెంచుకుంటోంది. ఫిబ్రవరి నెలలో ఈ దేశం 8 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. దీనివల్ల ఆ దేశ మొత్తం నిల్వలు 407 టన్నులకు పెరిగాయి. యుద్ధ కాలంలో కరెన్సీ విలువ పడిపోకుండా ఉండేందుకు ఈ దేశాలు అనుసరిస్తున్న వ్యూహం ఇది.భారత్ , చైనా పరిస్థితి ఏమిటిప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన చైనా, భారత్ కూడా తమ బంగారు నిల్వలు పటిష్టం చేసుకుంటున్నాయి..భారత్: గత నెలలో భారత్ సుమారు 0.2 టన్నుల బంగారాన్ని మాత్రమే కొనుగోలు చేసింది. ప్రస్తుతం భారత మొత్తం బంగారు నిల్వలు 880 టన్నులుగా ఉన్నాయి.చైనా: చైనా తన దూకుడును కొనసాగిస్తూ గతేడాది ఏకంగా 225 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. ప్రస్తుతం చైనా వద్ద అత్యధికంగా 2305 టన్నుల నిల్వలు ఉన్నాయి.దేశాలు ఎందుకు బంగారం కొంటున్నాయి?యుద్ధం లేదా ఆర్థిక మాంద్యం వంటి పరిస్థితులు వచ్చినప్పుడు డాలర్ విలువ లేదా దేశీయ కరెన్సీ విలువలో అస్థిరత ఏర్పడుతుంది. అటువంటి సమయంలో బంగారం మాత్రమే అత్యంత నమ్మకమైన సంపదగా ఉంటుంది. అందుకే సెంట్రల్ బ్యాంకులు తమ ఆస్తులను వైవిధ్యీకరించడానికి , ఆర్థిక భద్రత కోసం భారీగా బంగారాన్ని నిల్వ చేస్తున్నాయి.ప్రపంచ దేశాల మధ్య ఇప్పుడు బంగారు నిల్వలు (స్రశీశ్రీస తీవంవతీజవం) పెంచుకోవడంలో ఒక నిశ్శబ్ద పోటీ నడుస్తోంది. పోలాండ్ వంటి చిన్న దేశాలు దిగ్గజాలను మించి కొనుగోళ్లు చేయడం చూస్తుంటే.. భవిష్యత్తులో ఆర్థిక ఆధిపత్యం కోసం బంగారం ఒక కీలక ఆయుధంగా మారబోతోందని స్పష్టమవుతోంది. అంతర్జాతీయ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో బంగారం ధరలు మరిన్ని రికార్డులను సృష్టించడం ఖాయం!

## మీకు పన్ను లేకపోయినా ఐటీ రిటర్న్స్ దాఖలు చేయండి

**లేదంటే ఆ నష్టాలు తప్పవు!**




సాధారణంగా పన్ను పరిమితి లోపు ఆదాయం ఉన్నవారు లేదా పన్ను చెల్లించాల్సిన అవసరం లేనివారు "నేను ఐటీఆర్ ఎందుకు ఫైల్ చేయాలి?" అని అనుకుంటారు. కానీ, ఆర్థిక సంవత్సరం 2025-26లో పన్ను సున్నా అయినప్పటికీ ఐటీ రిటర్న్స్ ఫైలింగ్ చేయడం వల్ల మీరు ఊహించని లాభాలు ఉంటాయి. అసెస్‌మెంట్ ఇయర్ 2026-27 ఫైలింగ్ సీజన్ దగ్గరపడుతున్న వేళ, నిల్ రిటర్న్స్ దాఖలు చేయడం ఎందుకు మంచిదో ఇప్పుడు చూద్దాం.1. టీడీఎస్ రీఫండ్ పొందడానికి ఏకైక మార్గంమీరు పన్ను పరిమితి లోపే సంపాదిస్తున్నా, కొన్నిసార్లు మీ ఆదాయం నుంచి ముందే పన్ను కట్ అవుతుంది . ఉదాహరణకు బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ, ఫ్రీలాన్స్ ఆదాయం లేదా డివిడెండ్లపై టీడీఎస్ కోత పడవచ్చు. ఈ డబ్బును ప్రభుత్వం నుంచి తిరిగి పొందాలంటే , మీరు కచ్చితంగా ఐటీఆర్ ఫైల్ చేయాలి. ఐటీఆర్ దాఖలు చేయకపోతే, ఆ రీఫండ్ సొమ్ము మీకు అందదు. కాబట్టి, మీ సొమ్ము మీరు వెనక్కి తెచ్చుకోవడానికి నిల్ రిటర్న్ ఒక సాధనం.2. లోన్లు, క్రెడిట్ కార్డుల కోసం బలమైన ఆధారంమీరు భవిష్యత్తులో హోమ్ లోన్, పర్సనల్ లోన్ లేదా క్రెడిట్ కార్డ్ కోసం దరఖాస్తు చేసినప్పుడు, బ్యాంకులు గత 2-3 ఏళ్ల ఐటీఆర్ పత్రాలను అడుగుతాయి. ముఖ్యంగా ఫ్రీలాన్సర్లు లేదా స్థిరమైన ఉద్యోగం లేని వారికి ఐటీఆర్ అనేది ఒక నమ్మకమైన ఆదాయ ధృవీకరణ పత్రంగా పనిచేస్తుంది. మీరు క్రమం తప్పకుండా ఐటీఆర్ ఫైల్ చేస్తున్నారంటే, మీరు ఆర్థికంగా క్రమశిక్షణతో ఉన్నారని, పారదర్శకంగా వ్యవహరిస్తున్నారని బ్యాంకులకు నమ్మకం కలుగుతుంది. ఇది మీ లోన్ అప్రూవల్ అవకాశాలను పెంచుతుంది.3. విదేశీ వీసా దరఖాస్తు సులభమవుతుందిఅమెరికా, కెనడా, యూకే వంటి దేశాలకు వీసా కోసం దరఖాస్తు చేసినప్పుడు, వారు గత 3 నుండి 5 ఏళ్ల ఐటీఆర్ రికార్డులను అడుగుతారు. మీరు పన్ను చెల్లించకపోయినా, క్రమం తప్పకుండా రిటర్న్స్ ఫైల్ చేయడం వల్ల మీ ఆర్థిక స్థిరత్వం అధికారులకు అర్థమవుతుంది. మీరు చదువు కోసం లేదా ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లాలనుకున్నప్పుడు, ఈ డాక్యుమెంట్లు మీ అప్లికేషన్‌ను మరింత బలోపేతం చేస్తాయి.ఎలా ఫైల్ చేయాలిపన్ను లేని వారు ఐటీఆర్ ఫైల్ చేయడం ఇప్పుడు చాలా సులభం. ఆదాయపు పన్ను శాఖ అధికారిక పోర్టల్‌లోకి వెళ్లి ' ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. దీని కోసం ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. మీ దగ్గర ఫామ్-16 లేకపోయినా, మీ ఆదాయ వివరాలను స్వయంగా నమోదు చేసి ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు.ఐటీ రిటర్న్స్ ఫైలింగ్ అనేది కేవలం పన్ను చెల్లించే వారి కోసమే కాదు.. అది మన ఆర్థిక రికార్డును పటిష్టంగా ఉంచుకోవడానికి ఒక మార్గం. సున్నా పన్ను ఉన్నప్పుడు ఐటీఆర్ ఫైల్ చేయడం అంటే మన ఆర్థిక భవిష్యత్తు కోసం ఒక అడుగు ముందుకేయడమే. ఇది కేవలం పన్ను బాధ్యత కాదు, ఆర్థిక సన్నద్ధత. కాబట్టి, ఈ సీజన్‌లో మీ నిల్ రిటర్న్స్ ను దాఖలు చేయడం మర్చిపోకండి!

## ఇండియన్ రైల్వే మెగా గిఫ్ట్!

**టికెట్ ఇలా బుక్ చేసుకుంటే ఎక్స్ ట్రా డిస్కౌంట్!**





భారతీయ రైల్వే తన ప్రయాణికుల కోసం ఒక అద్భుతమైన వార్తను మోసుకొచ్చింది. 'డిజిటల్ ఇండియా'ను ప్రోత్సహించడంతో పాటు, ప్రయాణికులకు తక్కువ ధరకే సేవలు అందించే లక్ష్యంతో కొత్త రాయితీని ప్రకటించింది. దీని కింద, మీరు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకుంటే నేరుగా డిస్కౌంట్ పొందవచ్చు.3% డిస్కౌంట్ ఆఫర్ ఎలా పొందాలి సాధారణంగా రైలు ప్రయాణం చేసే వారు అన్-రిజర్వ్డ్ (జనరల్) టికెట్ల కోసం కౌంటర్ల వద్ద క్యూ కడుతుంటారు. అయితే ఇకపై రైల్ వన్ యాప్ ద్వారా డిజిటల్ పద్ధతిలో టికెట్లు బుక్ చేసుకుంటే, టికెట్ ధరపై 3% డిస్కౌంట్ లభిస్తుంది.ఈ రాయితీని పొందడానికి మీరు , డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా పేమెంట్ చేయాల్సి ఉంటుంది.ఈ ఆఫర్ జూలై 14, 2026 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది.రోజూ రైళ్లలో ప్రయాణించే వారికి 3 శాతం తక్కువగా అనిపించినా, నెలాఖరుకు ఇది గణనీయమైన మొత్తాన్ని ఆదా చేస్తుంది.ఏకైక యాప్.. అనేక సేవలు! రైల్వే శాఖ ప్రవేశపెట్టిన అవ యాప్ ఒక 'ఆల్ ఇన్ వన్' ప్లాట్‌ఫారమ్. దీని వల్ల ప్రయాణికులు వేర్వేరు యాప్‌లను వాడాల్సిన అవసరం ఉండదు. ఇందులో లభించే సేవలు:రిజర్వ్డ్ & అన్-రిజర్వ్డ్ టికెట్లు: ఒకే చోట అన్ని రకాల బుక్ చేసుకోవచ్చు.ప్లాట్‌ఫారమ్ టికెట్లు: క్యూలో నిలబడకుండా మొబైల్‌లోనే ప్లాట్‌ఫారమ్ టికెట్ పొందవచ్చు.లైవ్ స్టేటస్: రైలు ఎక్కడ ఉందో, ఏ ప్లాట్‌ఫారమ్‌కు వస్తుందో రియల్ టైమ్‌లో తెలుసుకోవచ్చు.స్టేటస్: మీ సీట్ కన్ఫర్మేషన్ వివరాలను సులభంగా చెక్ చేయవచ్చు. రాబోయే కాలంలో ప్రవేశపెట్టబోయే బుల్లెట్ రైళ్లు, అత్యాధునిక వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు, ఇప్పుడు 'ఔఅశ్రీూఅవ' వంటి డిజిటల్ విప్లవాలు భారత రైల్వే రూపురేఖలను పూర్తిగా మార్చబోతున్నాయి. టికెట్ బుకింగ్‌పై అందిస్తున్న ఈ 3% డిస్కౌంట్ వంటి ప్రోత్సాహకాలు సామాన్యుడి జేబుకు భారం తగ్గించడమే కాకుండా, దేశాన్ని డిజిటల్ దిశగా నడిపించడంలో కీలక పాత్ర



# కారా డైరెక్టర్ షాకింగ్ కామెంట్స్

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కారా'. విఘ్నేష్ రాజా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో ధనుష్ 'కరసామి' అనే పత్తి రైతు పాత్రలో కనిపించబోతున్నారు. ఇందులో ధనుష్ సరసన 'ప్రేమలు' బ్యూటీ మమిత బైజు హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన ప్రతీ అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోగా.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న డైరెక్టర్ మరిన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'నీ దగ్గర ఏదైనా ఆసక్తికరమైన కథ ఉండి, నాకు వినిపించాలనుకుంటే.. నేను వినడానికి సిద్ధంగా ఉన్నాను. ఒకవేళ నువ్వు నాతో కలిసి పనిచేయాలనుకుంటే, మనం ఒప్పందం కుదుర్చుకుని వెంటనే నిర్మాణాన్ని ప్రారంభిద్దాం అని ధనుష్ ఒకసారి నాతో అన్నారు. తర్వాత 2024లో ఈ సినిమా కథ నేను ఆయనకు వినిపించాను. మేము 2025లోనే చిత్రీకరణ స్టార్ట్ చేసినప్పటికీ కథా రచన (స్క్రిప్ట్) కోసం మాత్రం చాలా సమయం తీసుకున్నాము. దాదాపు 9 నెలల సమయం పట్టింది. అంతే కాకుండా స్క్రిప్ట్ పని పూర్తిగా కంప్లీట్ అయ్యేవరకు అగ్రిమెంట్ చేసుకోకూడదు అని ముందుగానే మేము నిర్ణయించుకున్నాము. ఎందుకంటే ఈ రోజుల్లో, ప్రేక్షకులను మెప్పించడానికి కేవలం ఒక మంచి సినిమా తీస్తే సరిపోదు. మనం వారి అంచనాలను మించిపోయేలా రాణించాల్సి ఉంటుంది.. పూర్తిగా ఈ కథ పనులు పూర్తయ్యాకే దీనిపై అగ్రిమెంట్ చేసుకున్నాము' అని చెప్పుకొచ్చారు.




# శ్రీనివాస మంగాపురం టీజర్ అప్‌డేట్

సూపర్ స్టార్ కృష్ణ ఫ్యామిలీ నుంచి మూడో తరంగా ఇండస్ట్రీ ఎంట్రీకి సిద్ధం అయ్యాడు దివంగత రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని. 'శ్రీనివాస మంగాపురం' అనే క్రేజీ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి లేటెస్ట్‌గా సాలిడ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఇందులో నుంచి టీజర్ రాబోతుందని తెలుపుతూ.. 'నిష్కల్మషత్వంలో పాతుకుపోయిన రెండు హృదయాలు.. తీవ్రతతో నిండిన ఒక గాథ.. శ్రీనివాస మంగాపురం టీజర్ రేపు సాయంత్రం 6 గంటలకు విడుదల కాబోతున్నది.. ఆ ప్రపంచం ఆవిష్కృతమవడాన్ని వీక్షించడానికి సిద్ధంగా ఉండండి' అంటూ ఓ క్యూట్ పోస్టర్‌ను షేర్ చేశారు. ప్రజెంట్ ఈ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. కాగా.. 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' వంటి సెన్సేషనల్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న కల్ట్ డైరెక్టర్ అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. చందమామ కథలు వంటి వైవిధ్యమైన చిత్రాలను నిర్మించిన బ్యానర్‌పై ప్రఖ్యాత నిర్మాత అశ్వనీదత్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు.?ఈ సినిమా ద్వారా బాలీవుడ్ బ్యూటీ రవీనా టాండన్ కూతురు రాషా తడాని టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన ప్రతీ అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

# యాక్షన్ డ్రామాతో రాబోతున్న రాశీ ఖన్నా

యంగ్ హీరోయిన్ రాశీ ఖన్నా తన కెరీర్‌లో ఒక గట్టి హిట్ కోసం ఎదురుచూస్తోంది. వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆమెకు అదృష్టం అంతగా కలిసి రావడం లేదు. చివరగా హిందీలో 'ది సబర్మతి రిపోర్ట్' చిత్రంతో హిట్ కొట్టి ఈ భామకు.. తెలుగులో భారీ అంచనాల మధ్య వచ్చిన తెలుసు కదా, ఉస్తాద్ భగత్ సింగ్ వంటి చిత్రాలు ప్రేక్షకులను పూర్తిస్థాయిలో మెప్పించలేకపోవడంతో, ఇప్పుడు ఆమె తన ఆశలన్నీ ఓటీటీపైనే పెట్టుకుంది. రాశీ ఖన్నా తన తదుపరి ప్రాజెక్ట్‌ను ఒక విభిన్నమైన మ్యూజికల్ యాక్షన్ డ్రామాగా ఎంచుకుంది. 'లుఖ్కే' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ క్రేజీ సిరీస్‌లో పాపులర్ ర్యాపర్ కింగ్ హీరోగా పరిచయం అవుతున్నారు. హిమాంక్ గౌర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్‌లో పాలక్ తివారి, శివాంకిత్, లక్ష్య వీర్ శరణ్ ముఖ్య పాత్రలో కనిపించబోతున్నారు. పంజాబ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ కథలో రాశీ ఖన్నా లుక్ పర్ఫార్మెన్స్ చాలా కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. పంజాబ్‌లోని ర్యాప్ మ్యూజిక్ కల్చర్, దాని వెనుక ఉన్న డ్రగ్ సిండికేట్, పగ – ప్రతీకారాల నేపథ్యంలో ఈ సిరీస్ సాగుతుంది. సంగీత ప్రపంచంలోని చీకటి కోణాలను చూపిస్తూనే, పక్కా యాక్షన్ ఎలిమెంట్స్‌తో దీన్ని రూపొందించారట మేకర్స్. సినిమాల్లో ఆశించిన సక్సెస్ రాకపోయినా, ఈ డిజిటల్ సిరీస్ ద్వారా తన సత్తా చాటాలని రాశీ ఖన్నా గట్టి పట్టుదలతో ఉంది. ఇక ఈ భారీ వెబ్ సిరీస్ డైరెక్ట్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్‌లో మే 8 నుంచి స్ట్రీమింగ్ కానుంది. కింగ్ మార్క్ మ్యూజిక్, రాశీ ఖన్నా గ్లామర్, యాక్షన్ కలగలిసిన ఈ సిరీస్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ నమ్ముతున్నారు. వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న రాశీ ఖన్నాకు 'లుఖ్కే' అయినా మంచి హిట్ ఇస్తుందని ఆమె అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# రుక్మిణి ప్లేస్‌లో మరో యంగ్ క్రేజియస్ట్ బ్యూటీ!



విభిన్న కథలతో కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లో కూడా తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుని ప్రస్తుతం స్టార్ హీరోగా దూసుకుపోతున్నాడు ధనుష్. ఆయన గ్యాప్ ఇవ్వకుండా బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్టులు అనౌన్స్ చేస్తూ బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టిస్తున్నాడు. అలాగే ప్రస్తుతం ఈ హీరో తన 56వ చిత్రంపై కూడా ఫోకస్ పెట్టినట్లు టాక్. తమిళ దర్శకుడు తమిళరసన్ పచ్చముత్తు ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నాడని తెలుస్తుండగా.. ఇందులో ఫీ మేల్ లీడ్ కోసం రుక్మిణి వసంత్‌ను ఓకే చేసినట్లు టాక్ వచ్చిన విషయం తెలిసిందే. 'కాంతార', 'ఏస్', 'మదరాసి' వంటి చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ రుక్మిణి వసంత్ ప్రస్తుతం చేతులో వరుస ప్రాజెక్టులు పెట్టుకుని బిజీ అయిపోయింది. ఈ క్రమంలోనే ధనుష్ 56వ చిత్రానికి గాను డేట్ సమస్యల కారణంగా ఈ మూవీ నుంచి రుక్మిణిని తప్పించినట్లు టాక్. అలాగే ధనుష్ సరసన హీరోయిన్‌గా సారా అర్జున్‌ను లైన్‌లో పెట్టారట మేకర్స్. టాక్స్ ఫైనల్ అయితే.. దీనిపై త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ అవకాశం ఉన్నట్లు కోలీవుడ్ వర్గాల నుంచి సమాచారం.



# ప్లీజ్ ఒక్క చాన్స్ ఇవ్వండి!

తెలుగులో మెంటల్ మదిలో, చిత్రలహరి వంటి సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నివేదా పేతురాజ్ ఇప్పుడు మళ్లీ వార్తల్లో నిలిచింది. ఒకప్పుడు వరుస అవకాశాలతో బిజీగా ఉన్న ఈ నటి, తన వ్యక్తిగత కారణాల వల్ల సినిమాలకు కాస్త విరామం ఇచ్చింది. అయితే, ఇప్పుడు ఆమె మళ్లీ సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నివేదా తన కెరీర్ జోరుగా సాగుతున్న సమయంలోనే బిజినెస్ మెన్ రజిత్ ఇబ్రాన్‌తో ప్రేమలో పడింది. అతనితో జీవితాన్ని పంచుకోవాలని నిర్ణయించుకున్న ఆమె, 2023లో సినిమాలకు దూరం అయింది. అంతేకాకుండా తన ప్రియుడితో క్లోజ్‌గా దిగిన ఫొటోలను షేర్ చేస్తూ.. కాబోయే భర్తను పరిచయం చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇక పెళ్లి బంధంతో ఒక్కటికాబోతున్నట్లు కూడా హింట్ ఇచ్చేసింది. దీంతో అంతా పెళ్లి చేసుకుని సెటిల్ అయిపోతుందని భావించారు. ఈక్రమంలోనే.. విధి వైపరీత్యం వల్ల వీరిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుండి ప్రియుడితో ఉన్న ఫోటోలన్నీ తొలగించి బ్రేకప్‌పై అందరికీ హింట్ ఇచ్చేసింది. తాజాగా రజిత్ మరో అమ్మాయితో నిశ్చితార్థం చేసుకోవడంతో, నివేదా తన గతాన్ని వదిలేసి మళ్లీ కెరీర్ మీద దృష్టి పెట్టిందట. ప్రస్తుతం నివేదా మళ్లీ వెండితెరపై మెరవాలని ఆరాటపడుతోంది. ఇందులో భాగంగా ఆమె టాలీవుడ్‌లోని పాత మేకర్స్‌ను, దర్శకులను సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది.



PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com